Sweken IT Solutions
WE ARE HIRING !!
POWER BI SPECIALIST
DATA ANALYST
INTERESTED CANDITATES
PLEASE SEND YOUR RESUME TO
MAIL: careers@sweken.com
PH: 9100986585

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

విలేఖరులు కావలెను
విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళం, పాలకొండ పట్టణాలకు విలేఖరులు కావలెను.
మేనేజర్
విశాఖ సమాచారమ్
సెల్: 7013785256, 9959867303

RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 128 విశాఖపట్నం, 27 ఫిబ్రవరి 2025 గురువారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

# హర హర మహాదేవ

## భక్తిశ్రద్ధలతో శివరాత్రి పర్వదినం





విశాఖ సమాచారమ్ నెట్ వర్క్ : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏపీలోని ప్రముఖ శైవ క్షేత్రాలు శివనామ స్మరణతో మారుమోగుతున్నాయి. శ్రీశైలం, కోటప్పకొండ , శ్రీకాళహస్తి , పాలకొల్లు, అమరావతి, విశాఖపట్నంలోని ఆలయాల్లో మహాశివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరుపుకున్నారు.



శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాలు ఏడో రోజు గజ వాహనంపై స్వామివారు దర్శనం ఇచ్చారు. బుధవారం కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. గుంటూరు జిల్లా అమరావతిలోని అమరామానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్నాడు జిల్లా కోటప్పకొండప్కై మహా శివరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. తెల్లవారుజామున బిందెతీర్థంతో శ్రీత్రికోటేశ్వర స్వామికి (మిగతా 2లో)

# ఏపీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో హోరాహోరీ

● ముగిసిన ప్రచారం ● మూడు స్థానాలకు పోలింగ్ రేపు



**అమరావతి, విశాఖపట్నం, ఏలూరు: ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):-** రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు జరుగుతున్న ఎన్నికల్లో ప్రధాన పక్షాల అభ్యర్థుల మధ్య పోటీ హోరాహోరీగా ఉంది. ఉమ్మడి గుంటూరు-కృష్ణా, తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రులు, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ గురువారం జరగనుంది. మంగళవారం సాయంత్రంతో ప్రచారం ముగిసింది. ఈ ఎన్నికల్లో అధికార కూటమి తరపున రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు తెదేపా అభ్యర్థులు బరిలో ఉన్నారు. వారికి రెండుచోట్లా పీడీఎఫ్ నుంచి గట్టిపోటీ ఎదురవుతోంది. ఈ రెండు స్థానాల్ని దక్కించుకునేందుకు కూటమి పార్టీలు సర్వశక్తులూ ఒడ్డి ప్రచారం చేశాయి. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికల్లో ముగ్గురు ప్రధాన అభ్యర్థుల మధ్య పోటీ నువ్వా నేనా అన్నట్టుగా ఉంది. అక్కడ ఏపీటీఎఫ్ అభ్యర్థికి అధికార కూటమిలోని తెదేపా, జనసేన పార్టీలు మద్దతు ప్రకటించాయి. కొందరు భాజపా నాయకులు మాత్రం పీఆర్టీయూ అభ్యర్థికి మద్దతిస్తున్నారు. వైకాపా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉంది. ఉమ్మడి గుంటూరు-కృష్ణా పట్టభద్రుల నియోజక వర్గం, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజక వర్గం నుంచి ప్రస్తుత ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, పాకలపాటి రఘువర్మ మరో సారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఉమ్మడి తూర్పు-పశ్చిమగోదావరి పట్టభద్రుల స్థానానికి అత్యధికంగా 35 మంది, కృష్ణా-గుంటూరు స్థానానికి 25 మంది, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ స్థానానికి పది మంది పోటీలో ఉన్నారు.

**ఉత్తరాంధ్రలో నువ్వానేనా**

**స్థానం:** ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ

**ప్రస్తుత ఎమ్మెల్సీ:** పాకలపాటి రఘువర్మ (ఏపీటీఎఫ్)

ఈ ఎన్నికల్లో ప్రధాన పోటీ: పాకలపాటి రఘువర్మ (ఏపీటీఎఫ్), గాదె శ్రీనివాసులు నాయుడు (పీఆర్టీయూ), కోరెడ్ల విజయగౌరి (యూటీఎఫ్)

**మొత్తం ఓట్లు: 22,493**

ఇక్కడ ప్రస్తుత ముగ్గురి మధ్య పోటీ నువ్వా నేనా అన్నట్టుగా ఉంది. రఘువర్మ తరపున ఉత్తరాంధ్రలోని కొన్ని ఉపాధ్యాయ సంఘాలతో పాటు, తెదేపా, జనసేన పార్టీల మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలు (మిగతా 2లో)

## నలుగురు కమర్షియల్ టాక్స్ అధికారుల సస్పెన్షన్

**హిందూపురం, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):-** అనంతపురం జిల్లా హిందూపురంలో నలుగురు కమర్షియల్ టాక్స్ అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. వ్యాపారుల వద్ద సీటీవో కృష్ణవేణి, డీసీటీవోలు రాజశేఖర్ రెడ్డి, మధుసూదన్, ఇంతియాజ్ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణలు చెలరేగాయి. జీఎస్టీ వసూళ్ల విషయంలో వ్యాపారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు పలువురు నుంచి ఫిర్యాదు అందాయి. (మిగతా 2లో)

## సూడాన్‌లో కూలిన సైనిక విమానం

# 46 మంది మృతి

**సూడాన్, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):-** సూడాన్‌లో ఘోర విమాన ప్రమాదం చోటుచేకుంది. వాడి సయిద్నా వైమానిక స్థావరం నుంచి ఓ సైనిక విమానం టేకాఫ్ అయిన కాసేపటికే నివాసాల మధ్య కుప్పకూలింది. ఈ ఘటనలో 46మంది సైనిక సిబ్బందితో పాటు పలువురు పౌరులు సైతం ప్రాణాలు కోల్పో (మిగతా 2లో)

## గోదావరిలో స్నానానికి వెళ్లి

# ఐదుగురు యువకుల మృతి



**తాళ్లపూడి, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):-** తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తాడిపూడిలో విషాదం చోటుచేసుకుంది. గోదావరిలో స్నానానికి దిగి ఐదుగురు యువకులు మృతిచెందారు. మహాశివరాత్రి సందర్భంగా తెల్లవారుజామున 11 మంది యువకులు గోదావరిలో స్నానం చేసేందుకు వెళ్లారు. నదిలో లోతుగా ఉన్న ప్రదేశాన్ని గుర్తించకపోవడంతో వారిలో ఐదుగురు యువకులు నీటిలో మునిగిపోయారు. ఈ క్రమంలో ఒకరినొకరు రక్షించుకునే ప్రయత్నంలో ఆ ఐదుగురూ గల్లంతై ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. మృతులు టి.పవన్ (17), పి. దుర్గాప్రసాద్ (19), పి.సాయి కృష్ణ (19), ఎ. పవన్ (19), జి.ఆకాశ్ (19)గా గుర్తించారు. వీరంతా కొవ్వూరు, తాళ్లపూడి, రాజమహేంద్రవరంలో ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు. యువకులంతా ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో విషాదఛాయలు అలముకున్నాయి. కొవ్వూరు ఆర్డీవో రాణి (మిగతా 2లో)

# హైదరాబాద్ మెట్రో ఫేజ్-II కు అనుమతి ఇవ్వండి



◆ మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ కు నిధులు ఇవ్వండి ◆ రీజినల్ రింగ్ రైల్, డ్రైపోర్ట్‌లు మంజూరు చేయండి ◆ సెమీ కండక్టర్ మిషన్‌కు అనుమతించండి
◆ ప్రధాని మోదీకి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వినతి

**ఢిల్లీ, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):-** హైదరాబాద్ మహా నగరంలో మెట్రో రైలు సౌకర్యం అన్ని ప్రాంతాలకు అందుబాటులోకి ఉద్దేశించిన హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-II కు అనుమతించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం పదేళ్లుగా హైదరాబాద్ నగరంలో మెట్రో విస్తరణపై దృష్టి సారించలేదని ప్రధానమంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. హైదరాబాద్ నగరంలో ఫేజ్-II కింద రూ.24,269 కోట్ల అంచనా వ్యయంతో 76.4 కి.మీ పొడవైన అయిదు కారిడార్లను ప్రతిపాదించామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ఈ ప్రాజెక్టుకు వెంటనే అనుమతించాలని అభ్యర్థించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఆయన అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఉదయం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను ముఖ్యమంత్రి ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

రీజనల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగంలో ఇప్పటికే 90 శాతం భూ సేకరణ పూర్తయినందున ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని వెంటనే మంజూరు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఉత్తర భాగంతో పాటే దక్షిణ భాగం పూర్తయితే ఆర్ఆర్ఆర్‌ను పూర్తిగా సద్వినియోగం చేసుకోగలమన్నారు. దక్షిణ భాగం భూ సేకరణకు అయ్యే వ్యయంలో 50 శాతం భరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి ప్రధానమంత్రికి తెలియజేశారు. ఆర్ఆర్ఆర్‌కు సమాంతరంగా రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టు ప్రతిపాదన ఉందని పీఎం మోదీకి సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ఈ రీజినల్ రింగ్ రైలు పూర్తయితే తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లోని రైలు మార్గాలతో అనుసంధానత (కనెక్టివిటీ) సులభమవుతుందని ప్రధానమంత్రి మోదీకి సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు.. రీజినల్ రింగ్ రైలుకు అనుమతి ఇవ్వాలని పీఎంను సీఎం కోరారు. సముద్ర మార్గం లేని తెలంగాణకు వస్తువుల ఎగుమతులు, దిగుమతులు సులువుగా చేసేందుకు రీజనల్ రింగు రోడ్డు సమీపంలో డ్రైపోర్ట్ అవసరమని, ఆ డ్రైపోర్ట్ నుంచి ఏపీలోని సముద్ర పోర్ట్ లను కలిపేందుకు గ్రీన్ ఫీల్డ్ రోడ్డుతో పాటు రోడ్డును ఆనుకొని (మిగతా 2లో)

# ఏపీ ఫోరెన్సిక్ ల్యాబ్ నిర్మాణం 90శాతం పూర్తి



**అమరావతి, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):-** ఏపీ ఫోరెన్సిక్ ల్యాబ్ పనులు శరవేగంగా సాగుతున్నాయని హోంమంత్రి వంగలపూడి అనిత ఎక్స్ వేదికగా వెల్లడించారు. విజయవాడలోని హోంమంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏపీ ఫోరెన్సిక్ ల్యాబ్ డైరెక్టర్ జి.పాలరాజు (ఐజీ) హోంమంత్రి వంగలపూడి అనితని మర్యాదపూర్వకంగా కలిశారు. 2017లో తెలుగుదేశం ప్రభుత్వం రూ.400 కోట్ల అంచనాతో అమరావతిలోని తుళ్లూరులో 5 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తోన్న ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ కార్యాలయ నిర్మాణ పనుల పురోగతిపై చర్చించారు. వైసీపీ ఆగిపోయిన పనులను 6నెలల్లో 90శాతం పూర్తి చేశామన్నారు. ప్రయోగశాల పనులూ చురుగ్గా జరుగుతున్నాయని వెల్లడించారు. 2017 డిసెంబరు 29న ఈ ల్యాబ్ కు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని మూలన పడేసింది. పైగా మూడు రాజధానుల నిర్మాణం అంటూ మొత్తం అమరావతి పనులనే పక్కన పెట్టింది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ పనులను పునఃప్రారంభించింది. మొత్తం మూడు బ్లాక్లలో ఈ ల్యాబ్ను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం బ్లాక్ 1 నిర్మాణం పూర్తి కావస్తోంది. రెండో బ్లాక్పనులను కూడా ప్రారంభించగా.. దీనికి సంబంధించిన పిల్లర్ల పనులు జరుగుతున్నాయి. ఈ ల్యాబ్ నిర్మాణం పూర్తయితే దేశంలోనే 8వ ఫోరెన్సిక్ ల్యాబ్ ఏపీలో ఉన్నట్లు అవుతుందని కూటమి ప్రభుత్వం చెబుతోంది. నేరస్తులను పట్టించడంలో ఇది కీలకంగా ఉండనుంది.

# చివరి రోజు కుంభమేళాకు పోటెత్తిన భక్తజనం



**ప్రయాగ్ రాజ్, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):-** ప్రయాగ్‌రాజ్‌లో అత్యంత వైభవంగా మొదలైన మహా కుంభ మేళా బుధవారం ముగిసింది. శివరాత్రి కావడంతో చివరి రోజు భక్తులు పోటెత్తారు. జనవరి 13న మొదలైన ఈ ఆధ్యాత్మిక వేడుక బుధవారం అత్యంత వైభవంగా ముగిసింది. 'హర హర మహాదేవ్' నామస్మరణలతో త్రివేణీ సంగమం ఘాట్లు మార్మోగాయి. మొత్తం కుంభమేళాకు సుమారు 70 కోట్ల మంది భక్తులు వచ్చినట్లు రాష్ట్రప్రభుత్వం పేర్కొంది. ఈ కుంభమేళాలో బుధవారం చివరి అమృత్ స్నానం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన ఏర్పాట్లు చేశారు . పోలీసులు, అధికారులు భక్తులకు ప్రత్యేక సూచనలు జారీ చేశారు. భద్రతా నియమాలు పాటించి తమతో సహకరించాలని కోరారు. ఇక, ఈ ఏర్పాట్లను గోరఖ్‌నాథ్ కంట్రోల్ రూమ్ నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పర్యవేక్షించారు.

ఇదిలాఉండగా.. కొన్నిరోజుల క్రితం మౌని అమావాస్య, వసంత పంచమి వంటి ముఖ్యమైన రోజుల్లో భక్తులు పెద్దఎత్తున పోటెత్తడంతో ప్రయాగ్‌రాజ్ మార్గంలోని జాతీయరహదారిపై సుమారు 350 కి.మీ. పొడవునా వాహనాలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఈసారి భక్తులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోకుండా ఉండేందుకు కుంభమేళా ప్రాంతాన్ని నో వెహికల్ జోన్‌గా అధికారులు ప్రకటించారు. మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి దీన్ని అమలుచేశారు. స్థానికుల కోసం నిత్యావసర సరకులు తీసుకొచ్చే వాహనాలను మాత్రమే అనుమతించారు. కుంభమేళా ముగిశాక భక్తులు క్షేమంగా తిరుగు పయనం అయ్యేలా ప్రయాగ్‌రాజ్ నుంచి దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు బుధవారం 350 రైళ్లను నడిపినట్లు రైల్వేశాఖ తెలిపింది.

# ముగిసిన జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం



**బుచ్చయ్యపేట, ఫిబ్రవరి 25 (విశాఖ సమాచారమ్):** జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం మోడల్ అంగన్వాడి సెంటర్స్ తయారీ విధానం ఐసిడిఎస్ సేవలో భాగంగానే వీటిని ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎంఈఓ 2 కాసి విశ్వేశ్వరరావు అన్నారు. బుచ్చయ్య పేట మండలం వడ్డాది హై స్కూల్లో జరిగిన జ్ఞాన జ్యోతి ఆరో రోజు ముగింపు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు బాలింతలకు పిల్లలకు మరింత నాణ్యమైన సేవలు అందించాలని ఈ కార్యక్రమం ప్రవేశపెట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో కొన్ని ప్రధాన అంశాలు బాల్య సంరక్షణ వ్యాధి నిరోధిక టేకల వేయించడం పోషకాహారం అందించడం పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాల్లో నిర్వహించటం గర్భిణీ స్త్రీలు మరియు బాలింతలకు ఆహారం అందజేయడం అంగన్వాడి కార్యకర్తలకు శిక్షణ ఇవ్వడం ద్వారా వారి నైపుణ్యాలను మెరుగు పరుస్తామని అన్నారు ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు ఆరోగ్యము మరియు పోషక అభివృద్ధి చెయ్యాలని అన్నారు. జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం 120 రోజులపాటు ఉంటుందని అన్నారు మొదటి దశగా ఆరు రోజులు శిక్షణ ఇచ్చామని అన్నారు. ప్రతి అంగన్వాడి కార్యకర్తకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు శేషుబాబు టివి శేషగిరిరావు సిఆర్పిలు డిఆర్పిలు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ దుర్గాలమ్మ ఆలయంలో ఘనంగా మహాశివరాత్రి



**విశాఖపట్నం, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):-** పూర్ణా మార్కెట్ సమీపంలోని శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి దేవస్థానంలో బుధవారం మహాశివరాత్రి పర్వదిన వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి.ఉదయం 5 గంటల నుండి శ్రీ అమ్మవారికి కుంకుమార్చనలు వేడుకగా నిర్వహించారు.అనంతరం శ్రీ అమ్మవారి దర్శనాలు భక్తులకు కల్పించారు.భక్తులు శూలాల పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రసాద్ గార్డెన్స్, పండావీధి, కళు పాకల్లో ఏర్పాటు చేసిన అగ్రిగుండాలను భక్తులు తొక్కే కార్యక్రమాన్ని నిర్వహించారు భక్తులు ఉదయం నుండి శ్రీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పైల శేఖర్ బాబు పర్యవేక్షణలో మహాశివరాత్రి వేడుకలు నేత్రపర్వంగా జరిగాయి. ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. బుధవారం జరిగిన అమ్మవారి ఘాటాల ఊరేగింపులో పోలీసులతో పాటు ఆలయ ఈఓ శేఖర్ బాబు, 35వ వార్డు టీడీపీ అధ్యక్షులు బుచ్చ రామురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## (మొదటి పేజీ తరువాయిలు)

### హర హర మహాదేవ

కోటప్పకొండ తిరుణాళ్ల వేడుకగా జరిగింది. అదేవిధంగా ఏపీలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నంద్యాల జిల్లా శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిపారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి స్కెతం పెద్దఎత్తున శివస్వాములు, సాధారణ భక్తులు అధికసంఖ్యలో క్షేత్రానికి తరలివచ్చారు. ఉదయం నుంచే స్వామి, అమ్మవార్ల దర్శనానికి క్యూల్కైన్లలో భక్తులు, శివస్వాములు బారులు దీరారు. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం ప్రత్యేక క్యూల్కైన్లను ఏర్పాటు చేసింది, ఉచిత, శీఘ్ర, అతి శీఘ్ర క్యూల్కైన్ల ద్వారా భక్తులు దర్శనానికి అనుమతించారు. క్యూల్కైన్లలో భక్తులకు అల్పాహారం, మంచినీరు, బిస్కెట్లు అందజేశారు. ఉచిత దర్శనానికి 4 గంటలు, శీఘ్ర దర్శనానికి గంట సమయం పట్టింది. శివదీక్షా భక్తులకు మాత్రం ప్రత్యేకంగా చంద్రావతి కళ్యాణ మండపం నుంచి క్యూల్కైన్ ఏర్పాటు చేసినట్లు దేవస్థానం ఈవో శ్రీనివాసరావు, శివరాత్రి ఫెస్టివల్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. భక్తుల రద్దీతో ఆలయ ప్రధాన వీధులన్నీ కళకళలాడాయి.

**కోటప్పకొండ పై ...**

పల్నాడు జిల్లా నరసరావుపేట సమీపంలోని కోటప్పకొండపై మహా శివరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.

బుధవారం తెల్లవారుజాము 2 గంటలకు బిందెతీర్థంతో శ్రీత్రికోటేశ్వర స్వామికి తొలిపూజ ప్రారంభమైంది. అనంతరం ఆలయ పండితులు అభిషేకాలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే అరవిందబాబు, ఆలయ ఈవో చంద్రశేఖర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తొలిపూజ మహోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చారు.

### నలుగురు కమర్షియల్ టాక్స్ అధికారుల సస్పెన్షన్

అందాయి. దీంతో వారిపై ఉన్నతాధికారులు నిఘా పెట్టారు. స్పెషల్ టీమ్‌ను ఏర్పాటు చేసి విచారణ చేయించారు. స్పెషల్ టీమ్ అందజేసిన నివేదిక ఆధారంగా నలుగురు ఉద్యోగులు అవినీతికి పాల్పడినట్లు తేలింది. దీంతో నలుగురు అధికారులను సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

### సూడాన్‌లో కూలిన సైనిక విమానం

కోల్పోయారు. ఈ ఘటనలో పది మందికి పైగా గాయపడినట్లు అధికారులు బుధవారం వెల్లడించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే, ఈ ప్రమాదానికి గల కారణాలు మాత్రం తెలియరాలేదని.. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. ఘటనా స్థలంలో ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

సూడాన్ పై పట్టు కోసం సైన్యం , పారామిలిటరీ రాపిడ్ సపోర్ట్ ఫోర్స్ మధ్య కొనసాగుతున్న అంతర్యుద్ధం ఇటీవల తీవ్రరూపం దాల్చింది. ఈ నేపథ్యంలో న్యాలా ప్రాంతంలో ఇటీవల ఓ సైనిక విమానాన్ని కూల్చివేసినట్లు డార్ఫర్ పశ్చిమ ప్రాంతాన్ని నియంత్రిస్తున్న ఆర్ఎస్ఎఫ్ ప్రకటించింది. అయితే ప్రస్తుత ప్రమాదానికి ఈ ఘర్షణలకు సంబంధం ఉందా? అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.

### హైదరాబాద్ మెట్రో ఫేజ్-II కు అనుమతి ఇవ్వండి

అనుకొని రైలు మార్గం మంజూరు చేయాలని ప్రధానమంత్రి మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.

తెలంగాణ సంస్కృతి, ఆధ్యాత్మికత మూసీ నదితో ముడిపడి ఉందని... రాజధాని హైదరాబాద్ నగరం మధ్యగా మూసీ ప్రవహిస్తోందని.. అంత ప్రాధాన్యం ఉన్న మూసీ పునరుజ్జీవనానికి సహకరించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈసా, మూసా నదుల సంగమంలో ఉన్న బాపూ ఘాట్ అభివృద్ధి, మూసీ ప్రక్షాళనకు 27 ఎస్టీపీల నిర్మాణం, మూసీ రిటైనింగ్ వాల్స్, కరకట్టల నిర్మాణం, మూసీ గోదావరి నదుల అనుసంధానంతో కలిపి మొత్తంగా ప్రాజెక్టుకు రూ.20 వేల కోట్లు ఆర్థిక సహాయం అందజేయాలని ప్రధానమంత్రిని ముఖ్యమంత్రి కోరారు. గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ కు 222.7 ఎకరాల రక్షణ భూముల బదిలీకి సహకరించాలని పీఎంకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణకు 61 ఐపీఎస్ కేడర్ పోస్టులు వచ్చాయని, 2015లో రివ్యూ తర్వాత మరో 15 పోస్టులు అదనంగా వచ్చాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ కేసులు పెరగడం, రాష్ట్రంలో పెరిగిన పట్టణాలు, ఇతర అవసరాల దృష్ట్యా తెలంగాణకు అదనంగా 29 ఐపీఎస్ పోస్టులు మంజూరు చేయాలని పీఎం మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.

సెమీ కండక్టర్ల పరిశ్రమ ఏర్పాటుకు అనువైన పరిస్థితులు తెలంగాణలో ఉన్నందున ఇండియా సెమీ కండక్టర్ మిషన్ ప్రాజెక్టును రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు అనమతించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఉన్నారు.

# రాత్రంతా రాజాం.. చీకట్లో జాగారం...!

**చిల్లర దొంగలు హల్ చల్...**
**చాలా కాలం నుండి లైన్ మెన్ లేక ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు..**
**స్థానిక ఎమ్మెల్యే ఏపీ ట్రాన్స్కో ఏడి స్పందించి పరిష్కారం మార్గం చూపాలి**



**బుచ్చయ్యపేట, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):-** మండలంలోని రాజాం గ్రామ ప్రజలు రాత్రులు చీకట్లో జాగారాలు చేస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నారు. వేసవి కాలం సమీపంలో గర్భిణీ స్త్రీలు, చంటి పిల్లలు, వృద్దులు సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు విద్యుత్ సరఫరా నిలిసిపోవడం తో రాత్రి అంతా గ్రామస్తులు అంతా చీకట్లో జాగారం చేయవలసివచ్చింది. చందేట్లో సందడి మాదిరాగా చిల్లర దొంగలు హల్ చల్, కాలి నీరు డ్రమ్ములు, గ్యాస్ సిలెండర్లు చోరీలకు చొరబడుతున్నారు. వివరాలు లోకి వెళితే సోమవారం రాత్రి రాజాం గ్రామం లో విధ్యుత్ సరఫరా అర్ధరాత్రి 12 గంటలకు పోయింది. అర్ధ రాత్రి సమయంలో చంటి పిల్లలు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు చాలా ఇబ్బందులు పడ్డారు. గ్రామంలో లైన్ మెన్ లేక చాలా కాలం నుండి ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామ సర్పంచ్ మరిసా నానీ, మాజీ ఎంపీటీసీ మరిసా సతీష్, కూటమి నేత మరిసా నరేష్, వార్డు నెంబర్ ఆకుల నాగేశ్వరరావు స్థానిక విలేకరుల తో మాట్లాడుతూ వడ్డాది ఏపీ ట్రాన్స్కో ఏఈ కి చాలా సార్లు విజ్ఞప్తి చేసిన పట్టించుకున్న పాపాన పోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కేవలం సచివాలయం జూనియర్ లైన్ మేన్ ద్వారా తాత్కాలిక సేవలు వలన ఇబ్బంది గా ఉంటుంది అని అలాగే కశింకోట నుండి 33 కేవి లైన్ రాజాం సబ్ స్టేషన్ నుండి ఇలా ఎర్రవాయి ప్రాంతం అంతటా సప్లై అవుతుందని కేవలం అనుభవం లేని హెల్పర్లు, తాత్కాలిక పనులు చేయడం వలన 24 గంటలు కరెంట్ సప్లై వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాజాం గ్రామ జనాభా సుమారు 10 వేలు ఉండగా రాత్రులు కూడా వయసు పై బడి చనిపోయిన వృద్ధులు రాత్రి సమయంలో చీకట్లో గడప వలసి వచ్చిందని వారు వాపోయారు. అంతేకాక, యలమంచిలి, నుండి పాడేరు, యలమంచిలి వైపు అర్ధరాత్రి వేళ ఆరుబయట వున్న గ్యాస్ సిలెండర్, కాళీ వాటర్ డ్రమ్ములు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే ఏపీ ట్రాన్స్కో ఏడి స్పందించి పరిష్కారం మార్గం చూపాలని కోరుతున్నారు.

### నేడు ప్రభుత్వ మరియు ప్రయివేటు పాఠశాలలకు సెలవు



**అనకాపల్లి, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):-** భారత ఎన్నికల సంఘం వారి ఆదేశముల ప్రకారం, తేదీ: 27-02-2025 న జరుగు శ్రీకాకుళం - విజయనగరం - విశాఖపట్నం ఉపాధ్యాయ నియోజిక ఎన్నికల సంధర్భంగా, అనకాపల్లి జిల్లా లో గల అన్నీ ప్రభుత్వ మరియు ప్రయివేటు పాఠశాల లకు అన్నింటికీ తేదీ: 27-02-2025 న శెలవు దినముగా ప్రకటించడం అయినదని జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ తెలియజేసారు.

### నైట్ హాల్ట్ బస్ సర్వీసులు పునర్ధిరించాలి



**జి మాడుగుల, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):-** మూడు మండలాల ప్రజలకు ఎంతో సౌకర్యంగా కలిగించే విశాఖపట్నం జి.మాడుగుల నైట్ హార్ట్ బస్ సర్వీసును పునరుద్ధరించాలని జి. మాడుగుల సర్పంచ్ కిముడు రాంబాబు ఎంపీటీసీ మత్స్య రాస విజయ్ కుమారి కోరారు. బుధవారం నాడు వారు విశాఖ సమాచారంతో మాట్లాడుతూ విశాఖపట్నం జి మాడుగుల నైట్ హాల్ట్ బస్ సర్వీస్ వలన పాడేరు జి మాడుగుల. చింతపల్లి మండలాల ప్రజలకు ఎంతో సౌకర్యం ఉండేదని వారు అన్నారు. విశాఖపట్నం అనకాపల్లి ప్రాంతాలకు ఉదయం బయలుదేరి వెళ్లి తమ పనులను చూసుకొని తిరిగి ఇళ్లకు చేరుకునే వారిని కానీ ఆ బస్ సర్వీసు రద్దుతో ఈ ప్రాంత ప్రజలకు తిప్పలు తప్పడం లేదని విశాఖపట్నం వెళ్లి రావడానికి రెండు రోజులు పడుతుందని రాత్రికి ఎక్కడ బస చేయాలో తెలియని పరిస్థితి ఈ ప్రాంతం ప్రజలు ఉన్నారని వారు అన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి పునరుద్ధరించాలని వారు కోరారు. వార్డు నెంబర్ మంజుల.మణి అమ్మాజీ. మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## (మొదటి పేజీ తరువాయిలు)

### ఏపీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో హోరాహోరీ

పనిచేస్తున్నారు. బరిలోంచి వైదొలగిన సుంకరి శ్రీనివాసరావు కూడా రఘువర్మకు మద్దతుగా నిలిచారు. పీఆర్‌టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడిని ఆరెస్సెస్‌తో సంబంధం ఉన్న ఒక ఉపాధ్యాయ సంఘం బలపర్చడంతో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ సహా మరికొందరు భాజపా నేతలు ఆయనకు మద్దతిస్తున్నారు. విజయగౌరి, గాదె శ్రీనివాసులునాయుడు ఒకే సామాజికవర్గానికి చెందినవారు. విజయనగరం జిల్లాలో ఈ ఇద్దరు అభ్యర్థుల వర్గీయులు మొదటి ప్రాధాన్యత ఓటు ఒకరికి, రెండో ప్రాధన్యతా ఓటు మరొకరికి పరస్పరం వేసుకునేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. శ్రీకాకుళం జిల్లాలో యూటీఎఫ్ బలంగా ఉంది. గత ఎన్నికల్లో రఘువర్మకు యూటీఎఫ్ మద్దతివ్వగా, ఈసారి యూటీఎఫ్ నుంచే అభ్యర్థి బరిలోకి దిగడంతో ఆయన విజయావకాశాలపై కొంత ప్రభావం పడుతుందని భావిస్తున్నారు.

**అభ్యర్థుల అనుకూలతలు**

**పాకలపాటి రఘువర్మ:** సిటింగ్ ఎమ్మెల్సీగా విస్తృత పరిచయాలు. కూటమి పార్టీలు సంపూర్ణ మద్దతివ్వడం. తెదేపా అగ్రనాయకత్వం ఎన్నికల్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పర్యవేక్షించడం, ఉపాధ్యాయుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించగలరన్న నమ్మకం. వైకాపా ప్రభుత్వం ఉపాధ్యాయులపై కక్షపూరితంగా వ్యవహరించడంపై శాసనమండలిలో గళమెత్తడం.

గాదె శ్రీనివాసులునాయుడు: 2007-13, 2013-19 మధ్య రెండుసార్లు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీగా పనిచేయడం. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని బలమైన సామాజికవర్గం అండగా ఉండటం. భాజపా అనుబంధ, ఇతర పెద్ద ఉపాధ్యాయ సంఘాలు మద్దతుగా నిలవడం.

**కోరెడ్ల విజయగౌరి:** తొలిసారి బరిలోకి దిగిన మహిళగా కొన్ని పక్షాల మద్దతు. ఉత్తరాంధ్రలో మహిళా ఉపాధ్యాయుల సంఖ్య పెరగడం, ఆమె సామాజికవర్గానికి చెందినవారి మద్దతు లభిస్తుందన్న అంచనాలు. విద్యార్థి, ఉపాధ్యాయ ఉద్యమాల్లో 40 ఏళ్లుగా కీలకపాత్ర పోషిస్తూ మంచిపేరు.

**గోదావరిబరిలో రసవత్తర పోరు**

స్థానం: ఉమ్మడి ఉభయగోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ
ప్రస్తుత ఎమ్మెల్సీ: ఇళ్ల వెంకటేశ్వరరావు

ఈ ఎన్నికల్లో ప్రధానపోటీ: పేరాబత్తుల రాజశేఖరం (అధికార కూటమి), డీవీ రాఘవులు (పీడీఎఫ్)

**ఓటర్ల సంఖ్య: 3,14,984**

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి, పీడీఎఫ్ అభ్యర్థుల మధ్య పోటీ రసవత్తరంగా మారింది. అధికార కూటమి తరఫున బరిలో నిలిచిన తెదేపా నేత పేరాబత్తుల రాజశేఖరం విజయానికి ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన తెదేపా, జనసేన, భాజపా నాయకులు గట్టిగా పనిచేస్తున్నారు. పీడీఎఫ్ అభ్యర్థి డీవీ రాఘవుల్ని గెలిపించేందుకు సీపీఎంతో పాటు, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు కృషిచేస్తున్నాయి. గత ఎన్నికల్లోలా భారీ ప్రచారాలు, విందులు వినోదాల హడావుడి ఈసారి లేదు. చాపకింద నీరులా అభ్యర్థులు ప్రచారం కొనసాగించారు. ధనప్రభావం కొంచెం ఎక్కువే ఉంది.

**అభ్యర్థుల అనుకూలతలు**

**రాజశేఖరం:** కూటమి ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు అండగా నిలవడం. బలమైన సామాజికవర్గానికి చెందినవారు కావడం. రాజశేఖరం కూటమి అభ్యర్థి కాబట్టి ఆయనను గెలిపిస్తే ఈ ప్రాంతంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు, అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పడుతుందన్న భావన ప్రజల్లోకి వెళ్లడం. సామాజిక మాధ్యమాల్ని వినియోగించుకుంటూ ప్రచారం చేయడం.

**డీవీ రాఘవులు:** సీపీఎంతో పాటు, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల మద్దతు బలంగా బలంగా ఉండటం. అధికారికంగా ప్రకటించకపోయినా వైకాపా అంతర్గతంగా మద్దతివ్వడం. సామాజికవర్గం అండగా ఉంటుందన్న నమ్మకం.

**కృష్ణా-గుంటూరు స్థానంలో హోరాహోరీ**

**స్థానం:** ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ

**ప్రస్తుత ఎమ్మెల్సీ:** కేఎస్ లక్ష్మణరావు

ఇప్పుడు ప్రధాన పోటీ: కేఎస్ లక్ష్మణరావు (పీడీఎఫ్), ఆలపాటి రాజేంద్రప్రసాద్ (అధికార కూటమి)

**ఓటర్ల సంఖ్య : 3,47,116**

ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం ఎన్నిక ఆసక్తికరంగా మారింది. బరిలో 25మంది ఉన్నా ప్రధానంగా కూటమి అభ్యర్థి, తెదేపా సీనియర్ నేత, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, పీడీఎఫ్ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మధ్యే ఉంది. ఎన్నికల ప్రకటన వెలువడక ముందే ఆలపాటి అభ్యర్థిత్వం ఖరారు కావడంతో ఆయన అన్నింటా ఒకడుగు ముందే ఉన్నారు. అన్ని శాసనసభ నియోజకవర్గాల్లో తెదేపా, జనసేన, భాజపా నాయకుల్ని ఒకతాటిపైకి తెచ్చి వారి అండతో ఓటర్ల మద్దతు కూడగట్టారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న కేఎస్ లక్ష్మణరావు పీడీఎఫ్ తరఫున ఐదోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఉపాధ్యాయ సంఘాలు, వామపక్షాలు, ప్రజాసంఘాలు, కార్మిక సంఘాల్లో పట్టు ఉండటం లక్ష్మణరావుకు కలిసొచ్చే అంశం. పోటీపరీక్షలకు శిక్షణ ఇచ్చిన అనుభవం ఉండటంతో పట్టభద్రులతో నేరుగా సంబంధాలు ఉన్నాయి. వామపక్ష అనుబంధసంఘాలు లక్ష్మణరావు తరఫున ప్రచారం చేయడంతో ఎక్కువమందిని కలవగలిగారు.

**అభ్యర్థుల అనుకూలతలు**

**ఆలపాటి రాజేంద్రప్రసాద్:** కూటమి అభ్యర్థిగా ఆయన గెలిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తారన్న నమ్మకం. విస్తృతంగా ఓటర్ల నమోదు చేపట్టి, ఇంటింటి ప్రచారం చేయడం. ఎస్టీయూ, నోబుల్ టీచర్స్ అసోసియేషన్, టీఎన్‌యూఎస్, ఏపీటీఎఫ్, ఆప్టా తదితర సంఘాల మద్దతు. మూడు దశాబ్దాలకుపైగా రాజకీయాల్లో ఉండడం, ఎమ్మెల్యే, మంత్రిగా పలువురితో పరిచయాలు.

**కేఎస్ లక్ష్మణరావు:** పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడుసార్లు గెలిచి ఉద్యోగ, ఉపాధ్యాయులకు అందుబాటులో ఉండటం. ఏపీటీఎఫ్(1938), పెన్షనర్లు, ఉద్యోగ, బ్యాంకు, కార్మికసంఘాల మద్దతు. ఓటర్లను నేరుగా కలవడం, వ్యక్తిగతంగా అవినీతి ఆరోపణలు లేకపోవడం. ఉద్యోగ, ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యల పట్ల అవగాహన ఉండడం.


శ్రీనివాసులు


విజయగౌరి


రాజశేఖరం


డీవీ రాఘవులు


ఆలపాటి రాజేంద్రప్రసాద్


కేఎస్ లక్ష్మణరావు

## శివనామ స్మరణతో మార్మోగిన శివాలయాలు



**పాయకరావుపేట, ఫిబ్రవరి 26,(విశాఖ సమాచారమ్):-** మండలంలోని పాల్మన్ పేట సముద్ర తీరాన్ని అనుకోని ఉన్న శివాలయం మహాశివరాత్రి పురస్కరించుకొనిసముద్ర స్థానాలు ఆచరించారు. శివాలయం సమీపంలో ఉన్న జగన్నాథస్వామి ఆలయంలో భక్తులు వారి కోరికలు కోరుకొని స్వామి వారి అశీసులు తీసుకోని తీర్థ ప్రసాదాలు తీసుకొన్నారు.అనంతరం గుడి ఆవరణలో మెడికల్ క్యాంపు నిర్వహించి పరిసరాల ప్రాంతాల్లో శానిటేషన్ పనులు మెడికల్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## శివనామస్మరణతో పులకించిన శివాలయాలు



**కే కోటపాడు, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):-** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బుధవారం తెల్లవారుజాము నుండి మహిళలు అధిక సంఖ్యలో శివాలయాలకు వెళ్ళి పూజలు నిర్వహించారు. కే కోటపాడు సింగన్న దొరపాలెం చంద్రయ్య పేట గ్రామాల్లోని శివాలయాల్లో అన్నదానాలు నిర్వహించారు. కె కోటపాడు శివాలయంలో అన్నదానాన్ని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. మాజీ సర్పంచ్ నూకల లక్ష్మీ నరసింహమూర్తి ఆధ్వర్యంలో సర్పంచ్ యర్రంశెట్టి భవాని గురయ్య, కూటమి పార్టీ నాయకులు చెరగడం సన్యాసినాయుడు నూరిశెట్టి ఉమామహేశ్వరరావు అధ్వర్యంలో మధ్యాహ్నం ముగ్గులు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. శివరాత్రి సందర్భంగా పలు శివాలయాల్లో ఆధ్యాత్మిక భజన కార్యక్రమాలు నిర్వహించారు.

## 15 లీటర్ల నాటు సారాతో వ్యక్తి అరెస్టు



**నర్సీపట్నం, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):-** బుధవారం ఉదయం 11.30 గంటలకి నర్సిపటనం స్టేషన్ పరిధిలో మాకవరపాలెం మండలం అప్పనదొరపాలెం గ్రామం లో ఉపమక అడవులు అలియాస్ రాజబాబు అలియాస్ రాజు,,బురుగుపాలెం గ్రామనికి చెందిన ఆ ఆసామీ నీ 15 లీటర్లు నాటు సారా కలిగి వుండగా అరెస్ట్ చేసి కోర్టు కి పపడమైనది అని నర్సీపట్నం స్టేషన్ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇనస్పెక్టర్ కె సునీల్ కుమార్ తెలిపారు ఈ దాడులలో సబ్ ఇన్స్పెక్టర్ ఈ కిరణ్ కుమార్ హెడ్ కానిస్టేబుల్ మరియు సిబ్బంది నారాయణరావు,బాబురావు, గోవర్ధన్ పాలోగనారు అన్ని నర్సీపట్నం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇనస్పెక్టర్ కె సునీల్ కుమార్ తెలిపారు.8

# ఎన్నికలు విజయవంతంగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



**అనకాపల్లి, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ పోలింగు అధికారులకు తెలిపారు. శుక్రవారం స్థానిక జి.వి.ఎం.సి. హైస్కూలులో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల పోలింగు సామగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా కలెక్టరు పరిశీలించారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి సిబ్బంది అందరికీ శిక్షణ అందించడం జరిగిందని, ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. ప్రజాస్వామ్యానికి ఎన్నికలు ఎంతో విలువైనవని, ఎన్నికల ప్రక్రియలో మీ సేవలు చాలా ముఖ్యమని తెలిపారు. ఎన్నికల సామగ్రి తీసుకున్న సిబ్బంది అన్నీ సరిగా ఉన్నది తనిఖీ చేసుకోవాలని తెలిపారు. ఓటర్లు అందరూ చదువుకున్నవారేనని, ఓటింగు పట్ల అవగాహన కలిగినవారేనని, అందువల్ల ఎటువంటి యిబ్బందులు రావని, సిబ్బంది అందరూ సమన్వయంతో పోలింగు విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టరు తెలిపారు. పోలింగు సిబ్బంది పోలింగు కేంద్రాలకు వెళ్లటకు, తిరిగి తీసుకొని వచ్చుటకు వాహనాలు ఏర్పాటు చేయడం జరిగిందని, రూటు వారీగా వారిని తీసుకువెళ్ళి, పోలింగు అనంతరం తిరిగి తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. పోలింగు సిబ్బందికి కావలసిన భోజన, వసతి ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలియజేసారు. పోలింగు అనంతరం జివిఎంసి హైస్కూలు లో ఏర్పాటుచేసిన రిసెప్షను సెంటరులో బ్యాలెట్ బాక్సులు, మెటీరియల్ జాగ్రత్తగా అందజేయాలన్నారు.జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు పర్యవేక్షణలో పోలింగు సామగ్రి పంపిణీ చేసారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ కొరకు 10 కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగింది.జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక పోలింగు ఆఫీసర్, ఒక అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్ మరియు ఇద్దరు ఇతర పోలింగ్ అధికారులు, సిబ్బందిని నియమించుట జరిగింది. అలాగే ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక మైక్రో అబ్జర్వర్ ని నియమించుట జరిగింది. ప్రతి పోలింగ్ కేంద్రములో లోపల మరియు బయట 2 వెబ్ కెమరాలు ఏర్పాటు చేసి, పోలింగ్ ప్రక్రియ అంతటిని వెబ్ కాస్టింగ్ చేసి, దీనిని పర్యవేక్షించుటకు కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసారు. పోలింగ్ రోజున ప్రతి రెండు గంటలకు పోలింగ్ శాతం రిపోర్ట్ తీసుకొనుటకుగాను కలెక్టరు కార్యాలయంలో ఏర్పాట్లు చేయడం జరిగింది. 24 పోలింగ్ కేంద్రాలకు 10 సెక్టార్ ఆఫీసర్లు మరియు 10 మంది రూట్ ఆఫీసర్లను నియమించారు. ఓటర్లు తమ ఓటుహక్కును ప్రశాంతంగా వినియోగించుకొనుటకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు మంచినీరు, ఎండ తగులకుండా టెంట్లు ఏర్పాటు చేయడం జరిగింది.పంపిణీ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారులు షేక్ ఆయిషా, వి.వి.రమణ, కలెక్టరు కార్యాలయ పరిపాలనాధికారి బి.వి.రాణి, ఎలక్షన్ సెక్షను సూపరింటెండెంటు ఎస్.ఎస్.వి. నాయుడు, తహశీల్దార్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# డి - ఫారం భూమిలో అనుమతి లేకుండా వే బ్రిడ్జ్ నిర్మాణమా...?

కంచె చేను మేస్తే కాచేది ఎవరు? అన్న చందంగా రెవిన్యూ అధికారుల తీరు
ప్రభుత్వ భూములు, ఆక్రమణలు కు గురవుతున్న కన్నెత్తి చూడని వైనం
మామ్ముళ్ల మత్తులో పడి ఏమి పట్టనట్లు చోద్యం చూస్తున్న రెవిన్యూ యంత్రాంగం



**బుచ్చయ్యపేట, ఫిబ్రవరి 26 ( విశాఖ సమాచారమ్):-** బుచ్చయ్యపేట మండలంలోని ప్రభుత్వ భూములు, డి- పట్టాల కబ్జాకు గురైతే అడిగే వారు లేరు అనే చందంగా తయారయింది. మండలంలోని చిట్టయ్యపాలెం గ్రామం లో సర్వే నెం. 230 లో ప్రభుత్వ నిబంధనలు కు వ్యతిరేకంగా డి - ఫారం భూమి ని ల్యాండ్ కన్వెర్షన్ చేయకుండా నిబంధనలను తుంగలో తొక్కి కొందరు అక్రమంగా ప్రభుత్వ అధికారులు చేతులు తడుపుతూ బరితెగించి అక్రమంగా వే బ్రిడ్జ్ నిర్మాణం చేయడానికి సన్నాహాలు చేపడుతున్నారని. ఈ వే బ్రిడ్జి నిర్మిస్తున్న స్థలం గతంలో డి - ఫారం భూమి పట్టా పొందిన వ్యక్తి వేరొకరికి లీజ్ కు ఇచ్చినట్లు ఆ వ్యక్తి మరో వ్యక్తి కి లీజ్ పేరిట ఇలా ఇచ్చుకుంటూ పోతూ మొత్తం మీద సుమారుగా ముగ్గురు వ్యక్తుల చేతులు మారినట్లు పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఎస్సి వర్గాలు కి చెందిన నిరు పేదలకు ఈ డి - ఫారం భూమి పట్టాలు మంజూరు చేసిందని ప్రస్తుతం అలా వచ్చిన డి పట్టా భూములలో సొంత పట్టాదారుడుని ఏ మార్పి వారి వద్ద నుండి 100 సంవత్సరాల లీజు పేరుతో లోబర్చుకుని కొంత మంది బడా నేతలు డి - ఫారం భూమి ని అనుభవిన్నున్నారని,ప్రభుత్వ నిబంధనలు ప్రకారం డి పట్టా భూములను పట్టా దారులు మాత్రమే సాగు చేసుకొని అనుభవించాలి తప్ప మరొకరికి అమ్మడం కానీ, వేరే వాళ్ల కొనడం కానీ చెయ్యకూడదు, అదేవిదంగా ఎటువంటి లీజుకు కానీ వ్యాపార సంస్థల నిర్మాణానికి గాని ఇవ్వకూడని నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని పక్కనపెట్టి ఎన్ని నిబంధనలు, చట్టాలు ఉన్నప్పటికీ తాయిలాలకు మరిగిన అధికారుల చేతులు తడుపుతూ చట్టాలను చుట్టాలుగా మార్చడం పరిపాటిగా మారింది.ఈ ఘటనతో సంబంధించిన శాఖలో అవినీతి ఎంతగా జరుగుతుందో అధికారుల పనితీరు చాలా స్పష్టంగా కనబడుతుంది.

మండలంలో ప్రభుత్వ భూములు, చెరువు గట్లు ఆక్రమణలు కు గురవుతున్న విషయాన్ని స్థానిక తహసీల్దార్ కు తెలిసే విధంగా పలు పత్రికలలో కథనాలు వచ్చినప్పటికీ ఆక్రమణదారుల పట్ల ఉదాసీనతతో వ్యవహరించి ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని క్షేత్ర స్థాయిలో రెవిన్యూ విఆర్ఎ, విఆర్ఓ, రెవిన్యూ ఇన్స్పెక్టర్, తహసీల్దార్లు కేవలం ఆఫీస్ లకు రావడం ఫైల్ మీద సంతకాలు పెట్టడానికి వీడియో కాన్ఫరెన్సకే అంకితమై క్షేత్రస్థాయిలో జరుగుతున్న అవినీతిని పరిశీలించి ఆక్రమణదారులపై శాఖపరమైన చర్యలు చేపట్టడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఆక్రమణలు జరుతున్న ప్రభుత్వ భూములు పై మామూళ్లు మత్తులో పడి చూసి చూడనట్లు గా పట్టి పట్టనట్లు చోద్యం చూస్తున్నారే తప్ప అక్రమణ దారులు పై ఎటువంటి చర్యలు చేపట్టడంలేదు. ఇప్పటికైన బుచ్చయ్యపేట మండల రెవిన్యూ అధికార యంత్రాంగం అక్రమార్కులు పై ప్రేమ, మామూళ్ల నిద్ర మత్తు విడిచి ఆక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ భూములను పరిరక్షించి అక్రమార్కులు, భూ కబ్జాదారుల చేతిలో నుండి ప్రభుత్వ భూములును , ఆస్తులను కాపాడాలని పలువురు ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

## ఓం శాంతి ఆధ్వర్యంలో 108 కలశాలతో ఊరేగింపు



**నర్సీపట్నం, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):-** నర్సీపట్నం మున్సిపాలిటీ శారద నగర్ లో ఉన్న ఓంశాంతి ఆధ్వర్యంలో బుధవారం మహాశివరాత్రి సందర్భంగా 108 కళాశాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపు శారద నగర్ నుంచి అబిద్ సెంటర్, వెంకు నాయుడుపేట మీదుగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓంశాంతి సభ్యులతోపాటు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రాత్రికి మహా జాగరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు.

## భరత్‌ను సత్కరించిన జానకిరామరాజు



**అనకాపల్లి, ఫిబ్రవరి 26, ( విశాఖ సమాచారమ్)** అనకాపల్లి నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ ఆదేశాల మేరకు నియమితులైన అనకాపల్లి పట్టణ పార్టీ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు బుధవారం అనకాపల్లి రింగ్ రోడ్డు పార్టీ కార్యాలయంలో భరత్ కుమార్ ని శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలియచేసారు... ఈ కార్యక్రమంలో వైసీపీ పార్టీ నాయకులు, మహిళల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## 24 కిలోల గంజాయి స్వాధీనం



**నక్కపల్లి, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):-** నక్కపల్లి మండలం సారిపల్లిపాలెం వద్ద 24 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు నక్కపల్లి సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు మంగళవారం తెలిపారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో కొనుగోలు చేసిన తమిళనాడు రాష్ట్రానికి తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. తమిళనాడుకు చెందిన ముగ్గురిని అరెస్టు అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ మేరకు ఆ ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు.

## స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు మోటివేషనల్ క్లాస్

**నక్కపల్లి, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):-** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉద్దండ పురంలో స్టేట్ అసిస్టెంట్ ఆర్గనైజింగ్ కమిషనర్ అహమ్మద్ షరీఫ్ వచ్చి పాఠశాలలో విజయవంతంగా నడుపుచున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు మోటివేషనల్ క్లాస్ నిర్వహించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అదేవిధంగా భారతదేశంలో ఉన్న ప్రతి ఒక్కరి స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థికి ఒక యు ఐ డి ఉంటుందని చెప్పి దాని ద్వారా ఆ విద్యార్థి దేశంలో ఎక్కడికెళ్ళినా ఆ ఐడి తో ప్రత్యేక గుర్తింపు వస్తుందని తెలియజేశారు ప్రవేశిక పూర్తి చేసిన స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థినీ విద్యార్థులు 53 మందికి యుఐడి క్రియేట్ చేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు దంతంశెట్టి సత్యారావు తెలియజేశారు ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ టీచర్స్ పి శేఖర్ మరియు ఎం హరిత కుమారి పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య యోధుడు చంద్రశేఖర్ ఆజాద్

## నేడు వర్ధంతి



పేరొందిన స్వాతంత్ర్య సమర యోధుడు చంద్ర శేఖర్ అజాద్ మధ్యప్రదేశ్ లో 1906 జూలై 23 న కాన్పూర్ లో జన్మించారు. తల్లిదండ్రులు జగరాణీ దేవి, సీతారాం తివారీ లు. కాశీలో విద్యార్థిగా ఉన్నప్పుడు విదేశీ వాస్తు బహిష్కరణ లో భాగంగా తన నాయకత్వంలో జరిగిన ఊరేగింపు పై పోలీసులు దాడి చేసినప్పుడు రాయితో పోలీసును కోట్టారు పోలీసులు బంధించి న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. న్యాయమూర్తి అడిగిన ప్రశ్నలకు తన పేరును అజాద్ గా , తండ్రి పేరు స్వాధిక్ గా, తల్లి పేరు ధాత్రిలా గా చెప్పుకున్నారు. 15 కొరడా దెబ్బలు భారత మాతకు జై అంటూ భరించారు. దీంతో ఆయనను అజాద్ గా వ్యవహరించడం మొదలైంది. సహాయ నిరాకరనొద్యమంలో కొన్ని హింసాత్మక ఘటనలు చో టు చేసుకున్నాయి. అది తన సిద్ధాంతానికి విరుద్ధమని గాంధీజీ మంచి ఉదృతంగా ఉన్న ఆ ఉద్యమాన్ని అర్ధంతరంగా ఆపేశారు. గాంధీ చర్య దేశంలో కొన్ని లక్షల మంది హృదయాలను గాయపరచింది. దాంతో ఎందరో నవ యువకులు బ్రిటీష్ వారిని వెళ్లగొట్టేందుకు హింసా మార్గాన్ని ప్రారంభించారు. తోటి యువకులతో కలిసి 'హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లిక్ అసోసియేషన్' ప్రారంభించిన అజాద్ హింసా మార్గంలో ఉద్యమించారు రైలు దోపిడి, వైస్రాయ్ రైలు విద్రోహ చర్యలు 1926 లో వీరు రచించినవే. ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు లాలా లజుపతి రాయ్ మృతికి కారణమైన జాన్ సాండర్స్ అనే బ్రిటీష్ అధికారిని కాల్చి చంపారు. వీరి సహ చరులతో ద్రోహం వలన 1931 ఫిబ్రవరి 27 న పోలీసులు అలహాబాద్ లోని వీరిని చుట్టుముట్టారు. బ్రిటీష్ వారి చేతుల్లో మరణించకూడదని తన తానే తుపాకీ తో కాల్చుకుని అమరజీవి అయ్యాడు.

డా. జె.వి.ప్రమోద్. కుమార్
పైడిమెట్ట, 9490833108.

## టైలర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం ఫెడరేషన్ ఏర్పాటు చేయాలి



**విశాఖపట్నం, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):-** టైలర్ల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం టైలరింగ్ ఫెడరేషన్ను ఏర్పాటు చేయాలని ది గ్రేటర్ విశాఖపట్నం టైలర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ అధ్యక్షులు, జగదాంబ జంక్షన్ సమీపంలోని యాక్స్ టైలర్స్ అధినేత యర్రంశెట్టి గౌరీ శంకర్ పేర్కొన్నారు. కుట్టు మిషన్ కనిపెట్టిన విలియం ఓవే పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 28వ తేదీన టైలర్స్ డే జరుపుకొంటున్నామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గతంలో ఇచ్చిన హామీ మేరకు టైలర్ల కోసం ఫెడరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరారు. రెడీమేడ్ దుస్తులు రాజ్యమేలుతున్న నేపథ్యంలో టైలర్లకు పని లేకుండా పోయిందని దీంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. విశాఖపట్నంలో 7000 మందికి పైగా టైలర్లు ఉన్నారని వృత్తిని ఆధారం చేసుకొని జీవనం సాగిస్తున్నప్పటికీ సరైన ప్రోత్సాహం ఉండటం లేదని అన్నారు.ముఖ్యంగా మెటీరియల్ రేట్లు, లేబర్ చార్జీలు, షాపుల అద్దెలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో ఆదాయం పూర్తిగా తగ్గిపోయిందని చెప్పారు.దుస్తులు కుట్టించేవారి సంఖ్య కూడా తగ్గిపోయిందని ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. రెడీమెడ్ దుస్తులకు మన్నిక లేనప్పటికీ తక్కువ ధరలకు దొరుకుతున్నాయన్న కారణంతో వాటిని కొనుగోలు చేస్తున్నారని ఇది టైలర్లకు శాపంగా మారిందన్నారు. 50 ఏళ్ల దాటిన టైలర్లకు కళ్ళు కనబడవని వారికి రెగ్యులర్గా ఉచిత వైద్య సేవలు అందివ్వాలని,టైలర్ల పిల్లల విద్యకు ఫీజు రీయింబర్స్మెంట్ పథకం అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం టైలరింగ్ మెటీరియల్ను సబ్సిడీపై అందజేయాలని అదేవిధంగా మిషన్ల కొనుగోలు కూడా ఆర్థిక సహకారం ఇవ్వాలని బుధవారం రాష్ట్ర ప్రభుత్వంకు యర్రంశెట్టి గౌరీ శంకర్ విజ్ఞప్తి చేశారు.

విశాఖ సమాచారమ్

గురువారం 27-2-2025

# విపక్షం వింత పోకడ !

ఏపీ శాసనసభలో విపక్ష వైసీపీ తీరు విడ్డూరంగా ఉంది. ప్రతిపక్ష హోదా ఇస్తేనే సభకు వస్తామని చెప్పడం సరికాదు. ప్రతిపక్ష హోదా ఉన్నా.. లేకున్నా ప్రజా సమస్యలు ప్రస్తావించవచ్చు. వాటిపై పోరాడవచ్చు. తమ గళం వినిపించవచ్చు. అలా చేస్తూనే ప్రతిపక్ష హోదా కోసం కూడా పట్టు పట్టవచ్చు. న్యాయస్థానాల్లో నూ తమ వాదనలు వినిపించవచ్చు. అంతేగాని మొండిగా పట్టుబట్టి సమావేశాలను బహిష్కరించడం సరికాదు. అదే సమయంలో అధికార పక్షం కూడా విపక్ష సభ్యులను హేళన చేయడం ప్రజాస్వామ్యంలో తగదు.

చట్టసభల సభ్యులంటే శాసన నిర్మాతలు. జనజీవితాలను ప్రభావితం చేసే చట్టాలను రూపొందించేవారు. ప్రభుత్వ ప్రతిపాదిత బిల్లు ఏదైనా శాసనంగా మారాలంటే- చట్టసభ సభ్యులు అంగీకరించాలి. సంబంధిత బిల్లును ఆమూలాగ్రం నిశితంగా పరిశీలించి, దాని లాభనష్టాలపై సభ్యులందరూ చర్చించిన తరవాతే ఒక అంగీకారానికి రావాలి. అప్పుడే లోపరహితమైన చట్టాలు ప్రాణం పోసుకోగలవు. అలా జరగాలంటే ప్రతిపక్షాల పాత్ర కూడా ప్రధానం. అసలే మన దేశంలో పార్లమెంటు, రాష్ట్రాల అసెంబ్లీలు తగినన్ని రోజుల పాటు కొలువు తీరడం లేదు. కాలం గడిచే కొద్దీ చట్టసభలు సమావేశమయ్యే రోజుల సంఖ్య తగ్గిపోతోంది. ప్రజల బాగోగులతో నిమిత్తం లేని రాజకీయ విమర్శలు, వ్యక్తిగత దూషణలు, నిరవధిక నిరసనలతో ఉన్న కొద్దిపాటి సభా సమయమూ హరించుకుపోతోంది. అధికార, విపక్షాలు కలిసికట్టుగా ప్రజాప్రయోజనాలను నెరవేర్చాల్సిన తరుణంలో- తాము అసలు అసెంబ్లీకి వెళ్లేది లేదని వైసిపి అధినేత వైఎస్ జగన్ భీష్మించడం ప్రజాస్వామ్యంలో సరైన నిర్ణయం కాదు.

ప్రధాన ప్రతిపక్ష నాయకుడి హోదా ఇస్తేనే శాసనసభలో అడుగుపెడతానన్నది జగన్ పంతం. చట్టసభ మొత్తం సభ్యుల సంఖ్యలో పది శాతం సీట్లు కలిగిన విపక్ష పార్టీ నేతకే ఆ గుర్తింపు ఇవ్వాలన్నది సభా సాంప్రదాయంగా వస్తోంది. రాజ్యాంగంలో ఇలాంటి నిబంధన లేకపోయినా మొదటి లోక్‌సభ స్పీకర్ జి.వి.మవులాంకర్ విధించిన ఈ నిబంధన ఏడు దశాబ్దాలుగా యావద్దేశంలో అమలవుతోంది. అందుకే 1969 వరకు లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు(ఎల్‌వోపీ) అంటూ ఎవరూ లేరు. ఆ తరవాత అయిదో, ఏడో, ఎనిమిదో లోక్‌సభలలోనూ ఆ హోదా ఎవరికీ దక్కలేదు. 2014-2024 మధ్యలోనూ అదే పరిస్థితి. లోక్‌సభలో పదిశాతం సీట్లు లేకపోయినా తమకు 'ఎల్‌వోపీ' ఇవ్వాలన్న కాంగ్రెస్ పార్టీ వినతిని 2014లో నాటి స్పీకర్ తిరస్కరించారు. ప్రధాన ప్రతిపక్షమనే గుర్తింపును కాంగ్రెస్‌కు ఎందుకు ఇవ్వరాదో చెబుతూ అప్పటి అటార్నీ జనరల్ ఆఫ్ ఇండియా ముకుల్ రోహత్గీ లోక్‌సభకు తన అభిప్రాయాన్ని సవివరంగా తెలియజేశారు. అంటే, 'ఎల్‌వోపీ' హోదా ఇవ్వాల్సింది ప్రజలే కదా. వాళ్లు ఇవ్వని దానికోసం జగన్ మంకుపట్టు పట్టడం సరికాదు. తమకు ప్రతిపక్ష హోదా కావాలంటూ

స్పీకర్‌కు లేఖరాసిన జగన్- దానికోసమే హైకోర్టుకూ వెళ్లారు. అందులో ఎలాంటి తప్పు లేదు. అయితే ఆ వ్యాజ్యం పరిష్కారమయ్యే వరకైనా శాసనసభకు వచ్చే ఓపిక విపక్షానికి ఉండాలి కదా. మవులాంకర్ నిబంధనను వ్యతిరేకిస్తూ దాఖలైన వ్యాజ్యాన్ని 2014లోనే సుప్రీంకోర్టు కొట్టేసింది. అలాంటప్పుడు ఒక శాసనసభ్యుడిగా, మాజీ ముఖ్యమంత్రిగా తన బాధ్యతలను నిర్వర్తించకుండా జగన్ ఎందుకు తప్పించుకుని పారిపోతున్నారు? అరవై రోజుల పాటు అసెంబ్లీకి రాకపోతే తన సభ్యత్వం రద్దవుతుంది కాబట్టి మొన్న మొక్కుబడిగా అక్కడికి వెళ్లి సంతకం పెట్టి నిమిషాల్లో వెనుదిరిగారు ఆయన. తాను చెడ్డ కోతి వనమెల్లా చెరిచిందన్నట్లు, వైసిపి ఎమ్మెల్యేలెవరూ సభకు వెళ్లాల్సిన అవసరం లేదని ఏకపక్షంగా తేల్చేశారు. తమకు 40శాతం ఓట్లు వేసిన ప్రజల తరఫున జగన్ శాసనసభలో ఎందుకు మాట్లాడరు? ప్రజాసమస్యల పరిష్కారానికి శాసనసభలో గట్టిగా పోరాడితే అది ఆయనకు, ఆయన పార్టీకే మంచిది. తద్వారా వచ్చే ఎన్నికల నాటికి బలపడే అవకాశం వారికి ఉంటుంది. ఇప్పటికైనా ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో వారి ముందే ఉంది.

# ముక్త్యాలేశ్వర స్వామి దేవాలయం



ఆంధ్రప్రదేశ్ లో కృష్ణానది తీరాన ఉన్న ప్రాచీన శైవక్షేత్రం ముక్త్యాల. జగ్గయ్యపేటకు దాదాపు పన్నెండు కిలోమీటర్ల దూరంలో ముక్త్యాలేశ్వరుడు ఇక్కడ రెండు దేవాలయాల్లో వెలియడం విశేషం. ఒకటేమో కృష్ణానదితీరాన శ్వేత శృంగాద్రిపైనా, మరొకటి కృష్ణానది గర్భంలోని బంగారు దేవాలయంలో వెలిశాడు. ఈ స్వర్ణదేవాలయం బలిచక్రవర్తి ప్రతిష్ఠించినట్టు చెప్తారు. పూర్వం కృతయుగంలో బలి చక్రవర్తి పరమేశ్వరుడి గురించి తపస్సు చేశాడు. అతని తపస్సుకు మెచ్చి పరమేశ్వరుడు సాక్షాత్కరిస్తాడు. అప్పుడు బలిచక్రవర్తి ముక్త్యాలలో నెలకొని భక్తులకు ముక్తిని ప్రసాదించాలని కోరుతాడు. అందుకు ఈశ్వరుడు సరేనంటాడు. అలాగే నదీగర్భంలో ముక్త్యాలేశ్వరుడిగా వెలిశాడు. నాడు బలిచక్రవర్తి స్వర్ణదేవాలయం కట్టించాడు. అయితే అదే త్రేతాయుగంలో అది వెండి లింగమైంది. కృతయుగంలో స్వర్ణలింగమై వెలసిన ద్వాపరకు వచ్చేసరికి కంచులింగమైంది. కలియుగంలో రాతి లింగమై నిలిచింది.

వర్షాకాలంలో ఈ లింగమే నీటిలో మునిగిపోయి ఆరు



నెలలపాటు ఉంటుంది. ఆ తర్వాతి ఆరు నెలలు ధూపదీప నైవేద్యాలు చేస్తారు. నదీగర్భంలో ఉన్నప్పుడు దేవతలే పూజిస్తారు. భరద్వాజ కొండపై వెలసిన ముక్తేశ్వరుడికి నిత్యపూజలుంటాయి. ఈ సపరమేశ్వరుడు రెండు చోట్ల వెలియడం, భక్తులను దీవించడం, అర్చించడంతోనే ముక్తిని ప్రసాదించడం ఓ విశేషం.



- సుగుణ శేఖర్ రెడ్డి గుమ్మళ్ల

# 'ఉక్కు' వీఆర్ఎస్‌లో వింతపోకడలు

**విశాఖపట్నం, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):-** విశాఖ ఉక్కులో స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) అమలులో డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ (డీపీఈ) మార్గదర్శకాలు పక్కన పెట్టారన్న విమర్శలొస్తున్నాయి. వీఆర్ఎస్ ప్రకటన తర్వాత అనూహ్యంగా విశాఖ ఉక్కుకు కేంద్రం రూ.11,400 కోట్ల భారీ ప్యాకేజీ ప్రకటించిన విషయం విధితమే. అపై కేంద్ర ఉక్కు మంత్రి ప్లాంటును సందర్శించి ప్యాకేజీ నిధులతో పూర్తిస్థాయి ఉత్పత్తి సాధించి లాభాల్లోకి తెస్తామని ప్రకటించారు. దీంతో పలువురు ఉద్యోగులు స్వచ్ఛంద పదవీ విరమణ ఆలోచన విరమించుకున్నారు. అయితే ఫిబ్రవరి 3 వరకే ఉపసంహరణ గడువు అంటూ వారిలో పలువురి అభ్యర్థనను తిరస్కరించారు. వాస్తవానికి డీపీఈ నిబంధనల ప్రకారం కమిటీ తుది నిర్ణయం తీసుకునే వరకు ఉపసంహరణకు గడువు ఉంటుంది. ఉద్యోగులు ఆందోళన చేయగా కొందరి అభ్యర్థన ఆమోదించినట్లు సమాచారం. వీఆర్ఎస్‌కు 1600 మంది దరఖాస్తు చేయగా దాదాపు 1100 మంది అర్హులుగా గుర్తించారు.

వార్షిక పనితీరు నివేదికలో నిర్లక్ష్యం: వీఆర్ఎస్ సర్క్యులర్‌లో ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం మూడు సంవత్సరాల వార్షిక పనితీరులో 'వో' గ్రేడ్ పొందిన ఎగ్జిక్యూటివ్‌లు, 'వెరీ గుడ్' అని పొందిన నాన్ ఎగ్జిక్యూటివ్‌లు అర్హులు కాదని పేర్కొన్నారు. ఉద్యోగుల గ్రేడింగ్‌లను 2024, 2023, 2022 సంవత్సరాలకు సంబంధించి పరిగణనలోకి తీసుకోవాలి. కానీ 2023, 2022, 2021 సంవత్సరాల గ్రేడ్లను పరిగణనలోకి తీసుకున్నారు. వార్షిక పనితీరు నివేదికను నంబరు 2024లో పూర్తి చేయాల్సి ఉండగా నిర్లక్ష్యం వహించారన్న విమర్శలున్నాయి. ఫిబ్రవరి 18న జవహర్‌లాల్ నెహ్రూ అవార్డులు ఇవ్వాల్సి ఉండగా వాటిని సైతం ఉద్యోగులు కోల్పోయారు. వీఆర్ఎస్‌కు అర్హత లేనివారు కూడా దరఖాస్తు చేసుకోవడానికి అనుమతిచ్చారు. దీనిపై మంత్రిత్వశాఖకు మెయిల్స్ ద్వారా ఫిర్యాదులు వెళ్లడంతో ఆ దరఖాస్తులు తొలగించినట్లు తెలుస్తోంది.

**ఉద్దేశం పక్కనపెట్టేసి:**

కొందరిపై ఒత్తిడి పెట్టి దరఖాస్తులు వెనక్కి తీసుకునేలా చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అనారోగ్యం, వయసు



రీత్యా విధులు నిర్వహించలేని వారికి వీఆర్ఎస్ ఉపయుక్తం కాగా...అలాంటి కొంతమంది దరఖాస్తులను సైతం తిరస్కరించారు. ఇటీవల ఓ ఉద్యోగి అధికారుల ఒత్తిడితో వీఆర్ఎస్ దరఖాస్తు ఉపసంహరించు కున్నట్లు సమాచారం. ఆ తర్వాత కొద్ది రోజులకే అతనికి గుండెపోటు రావడంతో రెండు స్టంట్స్ వేశారు. తన దరఖాస్తు పరిగణనలోకి తీసుకోవాలని ఆ ఉద్యోగి విజ్ఞప్తి చేశారు. అప్పటికి ఇంకా వీఆర్ఎస్ ప్రక్రియ పూర్తి కాలేదు. అయినప్పటికీ దరఖాస్తు పరిగణనలోకి తీసుకోలేదు. కోకోవన్ విభాగంలో 20 మంది హెచ్‌వోడీలకు అర్హత ఉన్నా వీఆర్ఎస్ దరఖాస్తులు తిరస్కరించినట్లు చర్చసాగుతోంది.

# ప్రపంచంలోనే ఎత్తైన శివుడి విగ్రహం ఎక్కడుందో తెలుసా?



**రాజస్థాన్, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):-** మహా శివరాత్రి సందర్భంగా బుధవారం నాడు దేశంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. శైవ క్షేత్రాలలో ఘనంగా వేడుకలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా దేశవిదేశాల్లోని ఎత్తైన శివుడి విగ్రహాల వివరాలను పరిశీలిస్తే... ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన శివుడి విగ్రహం రాజస్థాన్ లో ఉంది. రాష్ట్రంలోని నాథ్ ద్వార్ లో 351 అడుగుల ఎత్తున్న ఈ విగ్రహం పూర్తిగా ఇత్తడితో తయారుచేశారు. చుట్టూ పంటపొలాలు, కొండల మధ్య కూర్చుని ఉన్నట్లు విగ్రహాన్ని తీర్చిదిద్దారు.

కర్ణాటకలోని మురుడేశ్వర్ లో 123 అడుగుల ఎత్తైన శివుడి విగ్రహం ఉంది. అరేబియా సముద్ర తీరంలో తపస్సు చేసుకుంటున్న రూపంలో శివుడు ఇక్కడ కొలువయ్యాడు. గుజరాత్ లోని వడోదరలో ఏర్పాటు చేసిన శివుడి విగ్రహం ఎత్తు 120 అడుగులు. ఆదియోగి రూపంలో తమిళనాడులోని కోయంబత్తూరులో కొలువై ఉన్న మహాశివుడి విగ్రహం ఎత్తు 112 అడుగులు. సిక్కింలోని నామ్చిలో 108 అడుగుల ఎత్తైన శివయ్య విగ్రహం ఉంది.

హరిద్వార్ లోని స్వామి వివేకానంద పార్క్ లో 100 అడుగుల ఎత్తైన మహాశివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాల్లో ఒకటైన ద్వారకలోని నాగేశ్వర ఆలయంలో 88 అడుగుల ఎత్తైన విగ్రహ రూపంలో మహాశివుడు కొలువై ఉన్నాడు. కర్ణాటకలోని విజయపురిలో 85 అడుగుల ఎత్తైన మహాశివుడి విగ్రహం ఉంది. తమిళనాడులోని కీరమంగళంలో 81 అడుగుల శివుడి విగ్రహం ఉంది. మధ్యప్రదేశ్ లోని జబల్ పూర్ లో 76 అడుగుల ఎత్తైన మహాదేవుడి విగ్రహం ఉంది. బెంగళూరులో యోగముద్రలో ఉన్న శివోహం విగ్రహం ఎత్తు 65.6 అడుగులు.

# రాజ్యసభకు కేజ్రీవాల్ అంటూ ప్రచారం

## స్పందించిన ఆమ్ ఆద్మీ పార్టీ

- పంజాబ్‌లో ఉప ఎన్నికల బరిలో నిలిచిన రాజ్యసభ ఎంపీ సంజీవ్ ఆరోడా
- సంజీవ్ స్థానంలో కేజ్రీవాల్ రాజ్యసభకు వెళతారని ప్రచారం
- పార్టీలో అలాంటి చర్చ జరగలేదని ఖండించిన ఆమ్ ఆద్మీ పార్టీ



**ఢిల్లీ, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):-** ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ త్వరలో రాజ్యసభకు వెళ్లే అవకాశముందని ప్రచారం సాగుతోంది. ఈ ప్రచారంపై ఆమ్ ఆద్మీ పార్టీ స్పందించింది. కేజ్రీవాల్ రాజ్యసభకు వెళతారనేది అవాస్తవమని, అవన్నీ వదంతులేనని కొట్టిపారేసింది.

ప్రస్తుతం రాజ్యసభ ఎంపీగా ఉన్న సంజీవ్ ఆరోడాను ఆ పార్టీ పంజాబ్ ఉప ఎన్నికల బరిలో దింపింది. త్వరలో జరగనున్న లుథియానా వెస్ట్ అసెంబ్లీ ఉప ఎన్నికకు ఆమ్ ఆద్మీ పార్టీ సంజీవ్ ఆరోడా పేరును ఖరారు చేస్తూ ప్రకటనను విడుదల చేసింది. సంజీవ్ గెలుపొందే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో ఆయన స్థానంలో కేజ్రీవాల్ రాజ్యసభకు వెళ్లే అవకాశాలు ఉన్నాయని ప్రచారం సాగుతోంది.

కేజ్రీవాల్‌ను రాజ్యసభకు పంపించే అంశంపై పార్టీలో ఎలాంటి చర్చ జరగలేదని ఆమ్ ఆద్మీ పార్టీ పంజాబ్ విభాగం అధికార ప్రతినిధి జగ్తర్ సింగ్ తెలిపారు. ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగా ఇలాంటి ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఇటీవల జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అరవింద్ కేజ్రీవాల్ బీజేపీ అభ్యర్థి చేతిలో ఓడిపోయారు.

# శ్రీవారి సుప్రభాత సేవ అంటే ఏమిటి?

కలియుగ వైకుంఠపతి వేంకటేశ్వరుని సుప్రభాత సేవలో కీర్తించే స్తోత్రము.

"సు-ప్ర భాతము" అనగా "మంచి ఉదయం" అని అర్థం. హిందూ పూజా విధానాలలోను, ప్రత్యేకించి శ్రీవైష్ణవం ఆచార పరంపరలోను,

భగవంతుని పూజామూర్తికి అనేకమైన సేవలు (షోడశోపచారములు) నిర్వహించే సంప్రదాయం ఉంది.

ఇలాంటి సేవలలోనిదే సుప్రభాత సేవ. ఆ ప్రభాత సేవా సమయంలో చేసే కీర్తననే "సుప్రభాతం" అని అంటారు.

చాలా శైవ, వైష్ణవ మందిరాలలో సుప్రభాతం చదివే సంప్రదాయం ఉన్నా "సుప్రభాతం" అనగానే వెంకటేశ్వర సుప్రభాతం మాత్రమే స్ఫురణకు రావడం ముమ్మాటికీ నిజం.

**సుప్రభాతం జరుగు విధానం :........**

ప్రతి రోజూ బ్రాహ్మీ ముహూర్తం (2.30 నుండి 3.00) గంటల మధ్యలో శ్రీవారికి సుప్రభాత సేవ జరుగుతుంది.

ఆ సమయంలోనే 'సన్నిధిగొల్ల' దివిటీ పట్టుకుని ఉత్తర మాడవీధిలో ఉంటున్న వైఖానస అర్చకస్వామి ఇంటికి,

బేడి ఆంజనేయస్వామి గుడి వద్దనున్న పెద్ద జియ్యంగార్ మఠానికి వెళ్లి వారిని మర్యాదపూర్వకంగా ఆలయానికి తీసుకువస్తారు.

అర్చకులు శ్రీవారి బంగారు వాకిలి తెరవడానికి ఉపయోగపడే 'కుంచెకోల' అనే సాధనం, తాళం చెవులను ధ్వజస్తంభం దగ్గరున్న క్షేత్రపాలక శిలకు తాకిస్తారు.

వారు క్షేత్ర పాలకులకు, ధ్వజస్తంభానికి నమస్కరించి, ప్రదక్షిణం చేసి వెండివాకిలి దాటి, బంగారు వాకిలి ముందు శ్రీవారిని స్మరిస్తూ నిలుచుంటారు.

ఆ సమయానికి ఆలయ అధికారులు, పేష్కారు, శ్రీవారి సుప్రభాతాన్ని పఠించే వేదపండితులు,

తాళ్ళపాక అన్నమయ్య వంశస్థుడు ఒకరు తంబూరతో స్వామివారికి మేలుకొలుపు సంకీర్తన పాడడానికి సిద్ధంగా ఉంటారు.

తాళాలు తీసిన తర్వాత సన్నిధిగొల్ల బంగారు వాకిలి తెరచుకొని దివిటీతో లోనికి ప్రవేశిస్తారు.

ఆ తర్వాతే అర్చకులు మధురస్వరంలో "కౌసల్యా సుప్రజా రామా ..." అంటూ సుప్రభాతం అందుకొంటూ లోనికి ప్రవేశిస్తారు.

ఆ తర్వాత మహంతు, మఠం వారు తెచ్చిన 'పాలు, చక్కర, వెన్న, తాంబూలం' ఉన్న పళ్లెరాన్ని ఏకాంగి అందుకుని లోనికి తీసుకొని వెళ్తారు.

బంగారు వాకిలి ముందునున్న వేదపండితులు అర్చకులు సుప్రభాత గీతాలాపనాను కొనసాగిస్తారు.

సుప్రభాతంలో స్తోత్రం, ప్రపత్తి, మంగళాశాసనం పూర్తయిన తరువాత అన్నమయ్య వంశీయులు భూపాలరాగంలో ఒక మేలుకొలుపు కీర్తన గానం చేస్తారు.

దివిటీతో ముందుగా లోపలికి వెళ్ళిన సన్నిధిగొల్ల 'కులశేఖర పడి' వద్ద నిలిచి ఆ వెలుగులో శ్రీవారి దివ్యమంగళమూర్తిని తొలి దర్శనం చేసుకుంటారు.

ఆ తరువాత అర్చకులు, ఏకాంగి 'కులశేఖరపడి' దాటి లోపలికి ప్రవేశిస్తారు.

తరువాత శయన మండపంలో బంగారుపట్టు పరుపుపై పవళించి ఉన్న భోగ శ్రీనివాసమూర్తిని సమీపించి నమస్కరించి చప్పట్లు చరుస్తారు.

ఆ విధంగా ఆయన్ని మేల్కొనవలసినదిగా ప్రార్థిస్తారు ఆపైన భోగ శ్రీనివాసమూర్తి విగ్రహాన్ని జీవస్థానంలో.. మూల మూర్తి సన్నిధిలో వేంచేపు చేస్తారు.

ఆనంద నిలయంలో కులశేఖరపడి వద్దనున్న తెరవేసి అర్చకులు శ్రీవారికి దంతధావన, ఆచమనాది అనుష్ఠాన క్రియలను సమర్పిస్తారు.

మహంతు మఠం వారు తెచ్చిన నవనీతం, పాలు, చక్కెరలను నివేదన చేసి, స్వామివారికి సుగంధ తాంబూలాన్ని సమర్పిస్తారు.

బంగారు వాకిలి ముంగిట్లో వేదపండితులు (సుప్రభాతం) మంగళాశాసనాన్ని ముగిస్తూ ఉండగా, లోపల అర్చకులు శ్రీవారికి నవనీత హారతి ఇస్తుంటారు.

'నవనీత హారతి' అంటే నివేదనాంతరం ఇచ్చే మొదటి కర్పూర హారతిని నవనీత హారతి అని పిలుస్తారు. ఆ సమయంలోనే బంగారు వాకిళ్ళు తెరుస్తారు.

అపుడు శ్రీవారి పాదాలపై తులసీదళాలు, పుష్పాలు కూడా ఉండవు.

భక్తులకు ఆపాదమస్తకం స్వామి దివ్యమంగళ విగ్రహ దర్శనం లభిస్తుంది. అందుకే ఈ దర్శనాన్ని 'విశ్వరూప సందర్శనం' అని భక్తితో పిలుస్తారు.

ఈ హారతి తరువాత అర్చకులు గత రాత్రి బ్రహ్మాది దేవతలు శ్రీవారిని అర్చించడం కోసం మూల సన్నిధిలో ఉంచిన బ్రహ్మతీర్థాన్ని, చందనాన్ని, శఠారిని తాము ముందుగా స్వీకరించి.

ఆ తరువాత జియ్యంగారికి, ఏకాంగికి ఇస్తారు. సన్నిధిగొల్లకు కూడా తీర్థం, శఠారితో పాటు నివేదన పళ్ళెంలోని తాంబూలాన్ని అర్చకులు అందజేస్తారు.

స్వామివారి సుప్రభాత సేవకోసం భక్తులు వరుసగా స్వామివారి సన్నిధికి వెళ్ళి ఆ దివ్యమంగళ మూర్తిని దర్శించి తీర్థం, శఠారులను స్వీకరిస్తారు.

ధనుర్మాసంలో మాత్రం - సుప్రభాత గానం లేదు. ఆళ్వారులలో ఒకరయిన అండాళ్ తిరుప్పావై పాశురాన్ని గానం చేస్తారు.

ఇతర మాసాలలో భోగశ్రీనివాసమూర్తి ఏకాంత సేవలో భాగం వహించగా, ధనుర్మాసంలో మాత్రం శ్రీకృష్ణస్వామి విగ్రహం ఏకాంత సేవలో ప్రాధాన్యం సంతరించుకొంటారు..

కౌసల్యా సుప్రజా రామ ..గోవిందా నవనీత చౌర గోవిందా.. విశ్వరూప సందర్శక.. గోవిందా..

ఓం నమో వేంకటేశాయ?

పంచాంగం

గురువారం 27-2-2025

క్రోధి నామ సంవత్సరము

ఉత్తరాణాయణం, శిశిరరుతువు

మాఘ మాసం

| | |
|---|---|
| తిథి | : బ. చతుర్దశి ప. 8.55 ల అమావాస్య |
| నక్షత్రం | : ధనిష్ట ప. 3.44 |
| వర్జ్యం | : రా. 10.18 ల 11.43 |

# మీ కలాన్ని సంధించండి

కథలు, కవితలు, సాహిత్య, రాజకీయ విశ్లేషణలు, వ్యాసాలు, ప్రత్యేక కథనాలు, సందర్భోచిత కథనాలు... ఇలా ఏదైనా సరే.. రాసే ఆసక్తి ఉన్న వారు పంపవచ్చు. మీకు 'విశాఖ సమాచారమ్' దినపత్రిక చక్కటి వేదికగా నిలుస్తుంది. బాగున్న రచనలను మీ పేరు , ఫొటోతో సహా ప్రచురిస్తాము.

**మీ రచనలు పంపించవలసిన ఈమెయిల్ అడ్రస్**

**vspnews4@gmail.com**

**వాట్సాప్ నంబర్ : 9100986585.**

## శ్రీశ్రీశ్రీ సోమేశ్వర స్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినం



విశాఖపట్నం, ఫిబ్రవరి, 25, (విశాఖ సమాచారమ్):- బుధవారం పెందుర్తి నియోజకవర్గం పెదగంట్యాడ మండలం అప్పికొండ శ్రీశ్రీశ్రీ సోమేశ్వర స్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ సోమేశ్వర స్వామి వారిని సతీ సమేతంగా ప్రత్యేక అభిషేకాలు చేసి స్వామి వారి యొక్క తీర్థప్రసాదాలు స్వీకరించిన జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు వీరితోపాటు ఆలయం దేవస్థానం యొక్క ఈవో, స్థానిక కార్పొరేటర్ శ్రీ బట్ట సూర్య కుమారి, పంచకర్ల ప్రసాద్ రావు, స్థానిక వార్డు అధ్యక్షులు కాకి బాబు, చౌడేపల్లి పరదేశి, నక్క శ్రీను, నర్సింగ్, కొండబాబు స్థానిక ముఖ్య నాయకులు పెదగంట్యాడ మరియు పరవాడ మండలం ఉమ్మడి ఎన్డీఏ మహాకూటమి నాయకులు కార్యకర్తలు, వీర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవడం జరిగింది.

## ఘనంగా ప్రారంభమైన వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు



అనకాపల్లి, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):- పట్టణంలో ఉన్న శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 31వ ఆరాధన, మహా శివరాత్రి మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మహాశివరాత్రి సందర్భంగా శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ప్రత్యేక పూజలు అలంకరణ చేశారు. ఆలయం శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవ విగ్రహాన్ని పట్టణ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం రథం ఊరేగింపు తిరిగి బ్రహ్మంగారి గుడికి చేరుకుంది.ఈ కార్యక్రమంలో కార్పెంటర్ సంఘం శాశ్వత గౌరవ అధ్యక్షులు కోసూరి మన్మథరావు, ఆలయ కమిటీ అధ్యక్షులు వార్షిక కోరుకొండ వెంకటరావు, ప్రధాన కార్యదర్శి. సింహాద్రి కోటేశ్వరరావు, కోశాధికారి. తుంపాల సతీష్, పట్టణ కామాక్షి కార్పెంటర్స్ సభ్యులు, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు సభ్యులు పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



బుచ్చయ్యపేట, ఫిబ్రవరి 26 (విశాఖ సమాచారమ్):- మండలంలోని ఎల్బీపీ అగ్రహారం గ్రామం లో బుధవారం విధ్యుత్ షార్ట్ సర్క్యూట్ తో పూరిల్లు దగ్ధమైంది.గ్రామానికి చెందిన సానబోయిన అప్పారావు గత కొన్ని లుగా గ్రామంలో పూరీ ఇంటిలో నివసిస్తున్నాడు. అప్పారావు తన భార్యతో కలసి పొలం పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరు లేని సమయంలో విద్యుత్ సర్క్యూట్ అయ్యి మంటలు చెలరేగాయి. ఇంటి పై భాగం లో ప్లాస్టిక్ కవర్ కప్పి ఉండడంతో మంటలు లోపల చెలరేగాయి. మంటలను అదుపు చేయటానికి స్థానికులు ప్రయత్నాలు విఫలమయ్యాయి. చోడవరం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు రెండు లక్షల 50 వేలు ఆస్తి నష్టం ఉంటుందని అప్పారావు తెలిపారు. ఇంట్లో వస్తువులు ఫ్యాన్, బీరువా, బట్టలు, వంట సామాగ్రి అన్ని ఖాళీ బూడిదయ్యాయి.

## అఖండ జ్యోతి వెలిగించిన సుబ్బు గురువు



సాలూరు, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):- శ్రీ బాలా త్రిపుర సుందరి శ్రీ పంచముఖేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినమున అఖండ జ్యోతిని పంచముఖేశ్వర శర్మ (సుబ్బు గురువు) వెలిగించారు. అదేవిధంగా ఆయన ఆధ్వర్యంలో సనాతన ధర్మ పరిషత్ వారి ఆధ్వర్యంలో పారమ్మ కొండ పైన అఖండ జ్యోతిని మూడు రోజులు ఏర్పాటు చేశారు. ఈ అఖండ జ్యోతి నేటికీ 20 సంవత్సరములు దాటి ఏర్పాటు చేశారు. సనాతన ధర్ పరిషత్తు కమిటీ సభ్యులు పారమ్మ కొండ పై అఖండ జ్యోతిని ఏర్పాట్లు చూస్తున్నారు.

## మధ్యం అనర్థాలపై అవగాహన



పిఠాపురం, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):- గత 25 సంవత్సరాలు నుండి క్రమం తప్పకుండా మహాశివరాత్రి సందర్భంగా సహృదయ మిత్రమండలి వారి ఆధ్వర్యంలో స్థానిక పాత ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా ఉచిత ఆరోగ్య , మద్యం మాదక ద్రవ్యాలు మీద అవేర్నెస్ క్యాంపు నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సి.ఐ శ్రీనివాస్ వచ్చి స్టాల్ ను ప్రారంభించడం జరిగింది. సి.ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పుడు ఉన్న సమాజంలో ఇలాంటి క్యాంపులు యువతకి సమాజానికి చాలా ఉపయోగకరంగా ఉంటుందని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమానికి సహృదయ మిత్రమండలి అధ్యక్షులు తోట శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి సిహెచ్ సతీష్, ఉప కార్యదర్శి పి వేణు, గౌరవ అధ్యక్షులు కే అప్పారావు డాక్టర్ ఎన్ సూర్యనారాయణ మిత్ర మండలి సభ్యులు సాల్మన్ రాజు ప్రకాష్ రావు గోవింద్, తాతారావు, సుబ్రహ్మణ్యం, కుమార్, శ్రీను కరణం విశ్వనాథం తోట నాగేంద్ర ప్రసాద్ ప్రత్యూష్ మొదలైన వారు హాజరై కార్యక్రమాన్ని నిర్వహించారు.

## శివాలయాల్లో మేయర్ దంపతుల ప్రత్యేక పూజలు



విశాఖపట్నం, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):- మహాశివరాత్రి ని పురస్కరించుకొని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి దంపతులు 2వ జోన్ ఆరిలోవలోని పెదగదిలి, డ్రైవర్స్ కాలనీ, గాంధీ నగర్ తదితర ప్రాంతాలలో మహాశివరాత్రి ని పురస్కరించుకొని పలు శివాలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ

మహాశివరాత్రి నాడు శివపార్వతుల కళ్యాణం జరిగినట్టుగా నమ్ముతామని, అలాగే ఇదే రోజున లింగోద్భవం జరిగిందని పురాణాలలో చెప్పబడ్డాయి అన్నారు. పరమశివుడు పురుషుడిని సూచిస్తే, పార్వతీ దేవి ప్రకృతిని సూచిస్తుంది. సృష్టికి మూలమైన శక్తి చైతన్యాల కలయికను మహాశివరాత్రి పర్వదినంగా సూచిస్తుందన్నారు. అలాగే హిందువులు మహాశివరాత్రి నాడు ఉపవాసాలు, జాగారాలు చేసి తెల్లవారుజామున స్నానం ఆచరించి శివ దర్శనం చేసుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు.

## శివరాత్రి సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు



కే.కోటపాడు, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):- మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం మండలంలోని పలు శివాలయాల్లో భక్తి భజన అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మండలంలోని కే కోటపాడు సింగన్న దొరపాలెం చంద్రయ్యపేట ఆర్లి గొండు పాలెం మేడిచర్ల ఏ.కోడూరు ఆనందపురం లంకవానిపాలెం గ్రామాల్లో శివాలయాలు, పైడం పేట గ్రామంలో ఈశ్వరమ్మ తల్లి ఆలయం ఉన్నాయి. ఆయా శివాలయాల్లో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాల ప్రజలు అవసరమైన ఏర్పాట్లు చేశారు. కే కోటపాడు శివాలయంలో స్థానిక తెలుగుదేశం నాయకులు డోకల లక్ష్మీనరసింహమూర్తి సర్పంచ్ ఎర్రంశెట్టి భవాని గురయ్య ఆధ్వర్యంలో ఉదయం ముగ్గుల పోటీ మధ్యాహ్నం అన్నదానం రాత్రికి శివాలయంలో రుద్రాభిషేకాలు నిర్వహిస్తున్నారు. చంద్రయ్యపేటలోని బాట మల్లేశ్వర దేవాలయంలో కూడా బుధవారం అన్నదానం జరగనుంది.

## జీ తెలుగులో త్రిపుల్ బొనంజా




విశాఖపట్నం, ఫిబ్రవరి, 25, (విశాఖ సమాచారమ్):- వరుస సూపర్హిట్ సినిమాలు, సరికొత్త కాన్సెప్టులతో ఫిక్షన్, నాన్ఫిక్షన్ షోలతో అలరిస్తున్న జీ తెలుగు మరో త్రిపుల్ బొనాంజా ఎంటర్టైన్మెంట్తో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ ఏడాది సంక్రాంతి బ్లాక్బస్టర్గా నిలిచిన సంక్రాంతికి వస్తున్నాం సినిమాని వరల్డ్ టెలివిజ్ ప్రీమియర్గా ప్రసారం చేసేందుకు సిద్ధమైంది. జీ తెలుగు 16 సీరియల్స్ పోటీపడే సూపర్ సీరియల్ ఛాంపియన్షిప్, మధ్యతరగతి కుటుంబ కథతో ప్రేక్షకులను ఆకట్టకునేలా రూపొందుతున్న లక్ష్మీ నివాసం సీరియల్ని ప్రారంభించనుంది. సంక్రాంతికి వస్తున్నాం మార్చి 1(శనివారం)న సాయంత్రం 6 గంటలకు, నటులు శ్రీకాంత్, రోజా, రాశి, డైరెక్టర్ అనిల్ రావిపూడి అతిథులు గా హాజరైన సూపర్ సీరియల్ ఛాంపియన్షిప్ గ్రాండ్ లాంచ్ మార్చి 2(ఆదివారం) సాయంత్రం 6 గంటలకు, ప్రేమ, బాధ్యత, బంధాలే ప్రధానంగా సాగే సరికొత్త సీరియల్ లక్ష్మీ నివాసం ప్రారంభం మార్చి 3(సోమవారం) రాత్రి 7 గంటలకు.. మీ జీ తెలుగులో!

విక్టరీ వెంకటేష్, ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి ప్రధాన పాత్రల్లో నటించిన సంక్రాంతికి వస్తున్నాం సినిమా జీ తెలుగు వేదికగా బుల్లితెర ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే కథాంశంతో అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఈ సినిమా బాక్సాఫీస్ హిట్ గా నిలిచింది. ఈ శనివారం సాయంత్రం 6 గంటలకు వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్గా ప్రసారం కానుంది.

## పారమ్మ కొండపై పోటెత్తిన భక్తులు





సాలూరు, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):- సాలూరు నియోజకవర్గం పాచిపెంట మండలం పెద చీపురు వలస గ్రామం వద్ద మూడు వేల మెట్లతో నిర్మించిన కొండపై వెలసిన పారమ్మ తల్లి దర్శనానికి వేల సంఖ్యలో భక్తులు పోటెత్తారు. గిరిజన సంక్షేమ శాఖ మరియు స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కుటుంబ సమేతంగా వచ్చి అమ్మవారిని స్వామివారిని దర్శించుకున్నారు. మంత్రి సంధ్యారాణికి ఎండోమెంట్ అధికారులు జిల్లా ఎండోమెంట్ అధికారి ఫారం కొండ ఈవో రమేష్ గౌరవమర్యాదలతో ఆహ్వానించారు. అదే మండలంలో మంచాడ వలస గ్రామం వద్ద స్వామి దర్శనము నాకు, గురువు నాయుడు పేట వద్ద కొండపై నందీశ్వర స్వామి వారిని భక్తులు దర్శనం చేసుకున్నారు. సాలూరు పట్టణంలో శ్రీ శ్రీ బాల త్రిపుర సుందరి పంచముఖేశ్వర స్వామి ఆలయంలో వేల సంఖ్యలో భక్తులు దర్శనం చేసుకున్నారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో నాగరేశ్వర స్వామిని, శ్రీ కామాక్షమ్మ ఆలయంలో ఏకాంబరేశ్వర స్వామిని, దండిగాం రోడ్ లో ఉమామహేశ్వర స్వామి, వెలంపేటలో ఉన్న కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంది. సాలూరు మండలం మరుపల్లి వద్ద సువర్ణముఖి నది అవతల నందీశ్వర స్వామి ఆలయాన్ని కూడా భక్తులు దర్శనం చేసుకున్నారు. మక్కువ మండలం ములక్కాయ వలసలో పురాతనమైన ఆలయమునకు దర్శన పోటెత్తారు. నియోజకవర్గంలో మెంటాడ మండలం జయతి గ్రామంలో స్వామివారిని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి మరియు స్త్రీ సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. పాండవల గృహ వద్ద స్వామివారిని మరియు శ్రీ చక్రాన్ని, భువనేశ్వరి స్వామి, భువనేశ్వరి దేవి అన్నపూర్ణాదేవి సుబ్రమణ్య స్వామి ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు.

## శివరాత్రి పర్వదినం సందర్భంగా ఓం నమశ్శివాయ అర్ధ ఏకం



అనకాపల్లి, ఫిబ్రవరి 26,( విశాఖ సమాచారమ్) మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా పట్టణంలో కోటవీధిలో వేంచేసియున్న శ్రీ సర్వకామదాంబ సమేత భోగలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఉదయం 6 గంటల నుండి సాయంకాలం 6:00 వరకు ఓం నమశివాయ నామ సంకీర్తన అర్ధ ఏకాహం కార్యక్రమం బుద్ధ రమణాజీ సతీమణి సరోజినీ దేవి మీరు కుమారులు మురళి సంతోష్ మానస సంస్కృతి సౌజన్యంతో ఘనంగా ప్రారంభమైంది .ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ కమిటీ సభ్యులు ఆలయ పురోహితులు చిన్ని స్వామి సూర్యనారాయణ భీమేశ్వరరావు చిన్న భీమేశ్వరరావు వేణు మరియు ఆలయ అర్చకులు అందరూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని హరిబాబు ప్రారంభించడం జరిగింది . ఆధ్యాత్మిక కార్యక్రమంలో శ్రీ గౌరీ గీతా మహిళా మండలి అధ్యక్షులు ఆడారి లక్ష్మి విజయ బొడ్డేడ కుసుమ హరినాథ్ మహిళా మండల సభ్యులు శ్రీ భక్తాంజనేయ మహిళా మండల సభ్యులు ఉమెన్స్ కాలేజ్ . వేగి గొరేష్ వీధిలోని మహిళా మండలి సభ్యులు శ్రీ సత్తమ్మ తల్లి మహిళా మండలి సభ్యులు శ్రీ సంతోషిమాత మహిళా మండల సభ్యులు ఆలయ కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

## టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మను గెలిపించండి

### కొణతాల వెంకటరావు అభ్యర్థన



అనకాపల్లి, ఫిబ్రవరి 26,( విశాఖ సమాచారమ్): ఈనెల 27 న జరుగు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఉపాధ్యాయ సమస్యల పట్ల అవగాహన కలిగిన వ్యక్తిగా పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మ కు మీ అమూల్యమైన మొదట ప్రాధాన్యత ఓటు ను వేసి అత్యధిక గెలిపించవలసిందిగా తెలుగు దేశం పార్టీ అనకాపల్లి పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. 2024 ఎన్నికల్లో వైసీపీ విధ్వంస పాలన, అరాచకం, అవినీతి అక్రమాలు, ఉపాధ్యాయులను వేధించిన విషయాలు, సభ్య సమాజం తల దించుకునే విధంగా విద్యాబుద్ధులు చెప్పే ఉపాధ్యాయులను మద్యం షాపుల దగ్గర కాపలాపెట్టి వేధించిన విషయం మర్చిపోకూడదని, వీటిని దృష్టిలో పెట్టుకుని 2024 ఎన్నికలలో కూటమి పార్టీలకు మద్దతు ఇచ్చి గెలిపించినట్లుగానే ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా మీ అమూల్యమైన ఓట్లను కూటమి ప్రభుత్వం మద్దతిస్తున్న రఘువర్మ కు వేసి విజయాన్ని చేకూర్చాల్సిందిగా వెంకటరావు కోరారు. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ విద్య వ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకువస్తున్నారని, గతంలో 16 యాప్ ల పనితో తీవ్ర ఒత్తిడికి గురైన విషయాన్ని, ఉపాధ్యాయ సమస్యలను నాడు వైసిపి విద్యా వ్యవస్థను నాశనం చేసిందాన్ని సరిదిద్దుతున్నారని, జి.వో 117ని రద్దు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారని ఉపాధ్యాయులకు గౌరవప్రదమైన స్థానంలో ఉంచాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆలోచన చేస్తున్నారని, మీ సమస్యలు పట్ల కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, కనుక టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి మద్దతిస్తున్న రఘువర్మకు మీ అమూల్యమైన ఓట్లు వేసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు కానుకగా ఇవ్వవలసిందిగా ఉపాధ్యాయులకు వెంకటరావు విజ్ఞప్తి చేశారు.

## అంగన్వాడీ టీచర్లు, వర్కర్లకు శిక్షణ కార్యక్రమం



**జి.మాడుగుల, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):-** అంగన్వాడీ టీచర్స్ మరియు వర్కర్స్ కు 18/2/2025 నుండి 25 /2/2025 వరకు అనగా ఆరు రోజులు సాల్ట్ 120 రోజుల సర్టిఫికెట్ కోర్స్ మరియు ఎఫ్ ఎల్ ఎన్ వాటి మీద అంగన్వాడి వర్కర్స్ శిక్షణ కార్యక్రమం ఇవ్వడం జరిగినది ఈ శిక్షణ కార్యక్రమమునకు సుమారు రోజుకు 260 మంది చొప్పున జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమానికి హాజరవ్వడం జరిగినది వీరికి ప్రతిరోజు మధ్యాహ్న భోజనం మరియు ఉదయం సాయంత్రం టి బిస్కెట్స్ అందించి శిక్షణ కార్యక్రమం దిగ్విజయంగా ముగించడం అయినది ఈ శిక్షణ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి మరియు ఐసిడిఎస్ పిఓ వారి ఆధ్వర్యంలో నిర్వహించబడినది ఈ శిక్షణ కార్యక్రమమునకు మండలంలో గల ఐసిడిఎస్ సూపర్వైజర్లు మరియు ఐసిడిఎస్ పిఓ మండల విద్యాశాఖ అధికారి హాజరు కావడం జరిగినది. ఈ శిక్షణ కార్యక్రమమునకు మండల విద్యాశాఖ అధికారి సిహెచ్ బాబురావు గారు ఐ సి డి ఎస్ పి ఓ జి సుగనమ్మ మరియు ఆర్పీలు రంజన్ కుమార్, నీలకంఠం, సూరిబాబు అలాగే అంగన్వాడి సూపర్వైజర్ సత్య సుజాత మేడం గారు మొదలైన వారు పాల్గొని శిక్షణ కార్యక్రమం ఆరు రోజులు దిగ్విజయంగా నిర్వహించడం అయినది.

## భోగ లింగేశ్వర స్వామిని దర్శించుకున్న సత్యనారాయణ స్వామి పాలకమండలి



**అనకాపల్లి, ఫిబ్రవరి 26 (విశాఖ సమాచారమ్):-** పట్టణంలో కోట వీధిలో స్వయంభూ గా వెలసిన శ్రీ సర్వ కామదాంబ సమేత శ్రీ భోగలింగేశ్వర స్వామి, శ్రీ సిద్ధి లింగేశ్వర దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని కమిటీ వారి ఆహ్వానం మేరకు సుంకరమెట్ట శ్రీ సత్యనారాయణ స్వామి శ్రీ సూర్యనారాయణ స్వామి వార్ల దేవస్థానం చైర్మన్ బొడ్డేడ మురళి ధర్మకర్తలు దొడ్డి భరత్ మారిశెట్టి భాస్కరరావు తురకలపూడి హేమ ఈశ్వర్ స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీ భోగ లింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కాంద్రేగులసత్యనారాయణ,సిద్ధి లింగేశ్వర చైర్మన్ కృష్ణాజీ శాలువా తో సత్కరించి , స్వామి వారి ఫోటో అందజేశారు.ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు పెంటకోట గణేష్ మళ్ళ సూరిబాబు రాపేటి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


### భారతదేశపు స్ట్రీట్-స్మార్ట్ ఈవీ మరింత స్టైలిష్ గా మారింది: పరిచయం చేస్తున్నాం ఎంజి కామెట్ బ్లాక్ స్టార్మ్



**విశాఖపట్నం, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):-** జెఎస్‌డబ్ల్యూ ఎంజి మోటార్ ఇండియా, దేశపు ప్రముఖ ఎలక్ట్రిక్ కార తయారీదారు, కమిట్ ఈవీ పోర్ట్ ఫోలియోలో బ్లాక్ స్టార్మ్ ఎడిషన్ ను పరిచయం చేసింది, భారతదేశపు స్ట్రీట్-స్మార్ట్ ఈవీ స్టైల్ మరియు ఆకర్షణను మెరుగుపరిచింది. ఎక్స్-షోరూం ధర రూ. 7.8లాక్+ బ్యాటరీ అద్దె ఏ రూ. 2.5/కి.మీ. విడుదలైన కామెట్ బ్లాక్ స్టార్మ్ అగ్రగామి వేరియెంట్ గా నిలవనుంది. స్టైలిష్ మరియు టెక్ సేవీ సిటీ ప్రయాణికుడు ఇప్పుడు తమకు దగ్గరలో ఉన్న ఎంజి డీలర్ షిప్ ను సందర్శించవచ్చు మరియు రూ. 11,000కి కొత్త ఎంజి కామెట్ బ్లాక్ స్టార్మ్ ను బుక్ చేయవచ్చు.

ద కామెట్ బ్లాక్ స్టార్మ్ తన 'స్టారీ బ్లాక్ 'ఎక్స్ టీరియర్స్ ద్వారా ఆధునికత మరియు స్టైల్ ను ప్రదర్శిస్తుంది. ఇది కారు యొక్క పూర్తి రూపాన్ని మెరుగుపరుస్తుంది. కామెట్ ఈవీ నేమ్ ప్లేట్ డార్క్ క్రోమ్ లో తీర్చిదిద్దబడింది మరియు ఇంటర్నెట్ ఇన్ సైడ్ చిహ్నం నలుపు రంగులో పూర్తి చేయబడి చూస్తున్న వారిని ఆకట్టుకుంటుంది. లెదరెట్ సీట్ల పై ఎరుపు రంగులో 'బ్లాక్ స్టార్మ్' పదం ఎంబ్రాయిడరీతే ఇంటీరియర్స్ లో ఉపయోగించిన నలుపు ఇతివృత్తం ప్రీమియం అనుభవాన్ని వాగ్ధానం చేస్తోంది.

సంగీత ప్రియుల కోసం, కంపెనీ ఇప్పుడు ట్రాఫిక్ రద్దీతో కొంచెం ప్రశాంతత కలిగించడానికి కామెట్ బ్లాక్ స్టార్మ్ లో 4 స్పీకర్స్ అమర్చింది. ఈ కొత్త ఎడిషన్ లో ఫాస్ట్-ఛార్జింగ్ ను మద్దతు చేసే 17.4 కెడబ్ల్యూహెచ్ బ్యాటరీని కలిగి ఉంది మరియు ధృవీకరించబడిన రేంజ్ 230 కిలోమీటర్లను అందచేస్తుంది. కస్టమర్లు తమ కామెట్ బ్లాక్ స్టార్మ్ ను విలక్షణమైన బ్యాడ్జీ, వీల్ కవర్, మరియు హుడ్ బ్రాండింగ్ మరియు స్కిడ్ ప్లేట్స్ వంటి ఐచ్ఛిక స్టైలింగ్ అంశాలతో ప్రత్యేకమైన యాక్ససరీ ప్యాక్ తో మరింత వ్యక్తిగతం చేయవచ్చు.


# ఆధార్ నమోదుకు అధిక వసూళ్లకు పాల్పడితే కేసులు

## జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ హెచ్చరిక



**జి.మాడుగుల/పాడేరు, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):-** ఆధార్ కార్డులు నమోదు చేయడానికి అధిక వసూళ్లకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్.దినేష్ కుమార్ ఆదేశించారు. మీ సేవా కేంద్రాలు, నెట్ సెంటర్లలో నకిలీ జనన ధృవీకరణ పత్రాలు జారీ చేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నకిలీ ధృవపత్రాలతో ఆధార్ నమోదు చేస్తే తీవ్రమైన చర్యలు తీసుకుంటామన్నారు. మంగళవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఆధార్ పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెట్ సెంటర్లలో నకిలీ ఆధార్ కార్డులు జారీ కేంద్రాలపై అధికారులు తనిఖీ చేసి కేసులు నమోదు చేయాలని సూచించారు. ఐదేళ్ల లోపు పిల్లలందరికి ఆధార్ నమోదు చేయాలని ఆదేశించారు. ఆధార్ కార్డు ఉన్న వారికి ఆధార్ నవీకరణ చేయాలని చెప్పారు. 5 7 ఏళ్లు ఒక్కసారి, 15 నుండి 17 ఏళ్ల వయస్సు కలిగిన వారికి ఒక సారి ఆధార్ నవీకరణ చెయ్యాలన్నారు. జిల్లా లో 1 లక్ష 33 వేల మందికి ఆధార్ కార్డులు నమోదు చేయవలసి ఉందన్నారు. 35 వేల మందికి జనన ధృవీకరణ పత్రాలు జారీ చేయాలన్నారు. ఆధార్ కార్డులు, జనన ధృవీకరణ పత్రాలు జారీ చేయడానికి సచివాలయం డిజిటల్ అసిస్టెంట్లకు లక్ష్యాలు నిర్దేశించాలని సూచించారు. లక్ష్యాలు సాధించ లేని డిజిటల్ అసిస్టెంట్లను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఎంపిడి ఓలు, తాహాశీల్దారులు, నోడల్ అధికారులు, సబ్ కలెక్టర్లు నెలకు నాలుగు సచివాలయాను తనిఖీ చేయాలని చెప్పారు. పాఠశాల విద్యార్థులకు డి. ఇ. ఓ, జిల్లా గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు సమన్వయంతో ఆధార్ కార్డు నమోదు చేయించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు ఆధార్ నమోదు చేయించే బాధ్యత ఐసిడి ఎస్ అధికారులపైనే ఉందన్నారు. జిల్లా లో 36 వేల మందికి జనన ధృవీకరణ పత్రాలు ఇంకా జారీ చేయవలసి ఉందని పేర్కొన్నారు. ఆసుపత్రిలో ప్రసవం జరిగిన తరువాత ఆసుపత్రి నుండి డిశ్చార్జి చేసే నాటికి చిన్నారుల జనన ధృవీకరణ పత్రాలు అందించాలని చెప్పారు. సచివాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో జనన ధృవీకరణ పత్రాలు జారీ చేయాలని అన్నారు. గ్రామ సచివాలయాల పరిధిలో ఆధార్ కార్డులు లేని వారి వివరాలు సేకరించి ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలను నిర్వహించాలని ఆదేశించారు. సచివాలయం డిజిటల్ అసిస్టెంటలకు తగిన శిక్షణ అందించాలని అధికారులకు సూచించారు.

**ఆధార్ నమోదుకు చెల్లించ వలసిన రుసుము**

తప్పుని సరి నమోదు చేయడానికి, కొత్తగా ఆధార్ నమోదు చేసుకునే వారికి ఉచితంగా నమోదు చేస్తారన్నారు. బయోమెట్రిక్ నవీకరణకు రూ.100 ?, పేరు, చిరునామా, జెండర్ ఫోను నంబర్లు మార్పు చేయడానికి రూ.50లు, డాక్యుమెంటు నవీకరకు రూ.50లు చెల్లించాలని అన్నారు. జనన ధృవీకరణ పత్రం ఉండి ఇప్పటికి ఆధార్ నమోదు చేయించుకోకపోతే ఆధార్ శిబిరానికి వచ్చి ఆధార్ నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, రంపచోడవరం పి. ఓ. కె. సింహచలం (వర్చువల్)

సబ్ కలెక్టర్ కల్పనా శ్రీ (వర్చువల్) గాను గ్రామ వార్డు సచివాలయం నోడల్ అధికారి పి. ఎస్.కుమార్, భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ ప్రాజెక్టు మేనేజర్ జావీద్, డి ఆర్ డి ఏ, పి.డి. వి.మురళి, డి ఇ ఓ పి. బ్రహ్మాజీరావు, గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు ఎల్. రజని, ఇన్చార్జి డి. ఎల్ ఓ తేజ రతన్, పి. యం. యు ప్రోగ్రాం అధికారి ఆర్. రాం గోపాల్, గ్రామ సచివాలయం జిల్లా కో ఆర్డినేటర్ సునీల్ మొబైల్ కోర్డినేటర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ లో సమవాటా కోసం రెల్లి మేధావుల సంఘం పోరుబాట



**అనకాపల్లి, ఫిబ్రవరి 26 (విశాఖ సమాచారమ్ (ప్రతినిధి):-** ఎస్సీ వర్గీకరణ లో సమవాటా కోసం ఆంధ్రప్రదేశ్ రెల్లి మేధావుల సంఘం ఆధ్వర్యంలో రెల్లిల పోరుబాట కార్యాక్రమం రాష్ట్ర పర్యటనలో భాగంగా రెల్లి మేధావుల సంఘం అధ్యక్షులు బండి ఆదిసురేంద్ర అధ్వర్యంలో నెల్లిమర్ల శాసనసభ్యురాలు లోకం నాగ మాధవి ని భోగాపురం లో ఆమె స్వగృహంలో కలసి ఎస్సీ వర్గీకరణ లో రెల్లిల వాటా శాతాన్ని పెంచాలని వినతి పత్రం అందజేయడం జరిగింది. అసెంబ్లీలో రెల్లిల కోసం ఎవ్వరు ప్రస్తావించినా వారికి అరగంట సమయం కేటాయిస్తాను అని చెప్పి స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట ఇవ్వడం తో గతంలో రెల్లి జాతిని స్వీకరించిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మీద నమ్మకంతో శాసనసభలో రెల్లిల గురించి ప్రస్తావించగలగే, రెల్లిల అభివృద్ధి గురించి మాట్లాడే సత్తా ఉన్నటువంటి నాయకులు జనసేన వారే అని నమ్మి ఎమ్మెల్యే లోకం మాధవి ని కలవగా ఆమె సానుకూలంగా స్పందించి పవన్ కళ్యాణ్ తో మాట్లాడి శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో రెల్లిల కోసం మాట్లాడి వర్గీకరణలలో రెల్లిలకు న్యాయం జరిగేలాగా చూస్తామని హామీ ఇవ్వడం జరిగింది. అదేవిధంగా రెల్లిలకు అభివృద్ధి కి జనసేన కట్టుబడి ఉందని ఖచ్చితంగా న్యాయం చేస్తామని మాట ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో రాష్ట్ర ముఖ్య నాయకులు బొమ్మాలి శ్రీనివాస్, విజయనగరం రెల్లి కులాల సంక్షేమ సంఘం అధ్యక్షులు చెన్నా బంగార్రాజు, మహిళ అధ్యక్షురాలు పొడుగు కృష్ణవేణి, ఆర్ఐఎఫ్ సభ్యులు అర్జి లక్ష్మణ్ పాల్గొన్నారు.

# సజావుగా ఎన్నికలు నిర్వహించండి

## డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



**పాడేరు, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):-** శ్రీకాకుళం- విజయనగరం- విశాఖపట్నం ఉపాధ్యాయ ఎంఎల్ సి ఎన్నికల పోలింగ్ ను ఎటువంటి ఒత్తిడులకు లోను కాకుండా సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సిబ్బందిని ఆదేశించారు.బుధవారం స్థానిక తలారిసింగి ఎన్నికల సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ అక్కడ ఎర్పాటు చేసిన నాలుగు జోన్ల, రూట్ల అధికారులు సిబ్బందితో మాట్లాడి తగు సూచనలు జారీ చేసారు. ప్రిసైడింగ్ అధికారులను పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టి అనుమాన నివృత్తి చేసారు.ఎటువంటి అనుమానాలకైనా ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల మేరకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సామగ్రిని, బ్యాలెట్ బాక్స్ లను పరిశీలించారు. ఎన్నికల విధులు కేటాయించిన సిబ్బంది హాజరు, రిజర్వ్ సిబ్బంది హాజరు, బస్సులను పరిశీలించారు. సాయంత్రంలోగా సబంధిత పోలింగ్ కేంద్రానికి పోలింగ్ సిబ్బంది చేరుకోవాలని, బుధవారం ఉదయం 08.00 గంటలకే పోలింగ్ ప్రారంభించాలని ఆదేశించారు. ఓటరు వద్ద గల ఫోటో గుర్తింపు కార్డు పరిశీలించాకనే బ్యాలెట్ పేపర్ అందజేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ డా. ఎం జె అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డిఆర్ఓ కే. పద్మలత, జోనల్ అధికారులు, రూట్ అధికారులు, పోలింగ్ నిర్వహణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శివాలయాలను దర్శించుకున్న పీలా



**అనకాపల్లి, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్ ప్రతినిధి):-** మహాశివ రాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం అనకాపల్లి పట్టణం, గవరపాలెం శ్రీ భోగలింగేశ్వర స్వామి వారిని, శ్రీ సిద్ధిలింగేశ్వర స్వామి వార్లను రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, అనకాపల్లి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అనకాపల్లి మండలం, పిసినీకాడలోని స్వయంబూ శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వారిని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

## శివ నామస్మరణతో మార్మోగిన శివాలయాలు



**అనకాపల్లి, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):-** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా అనకాపల్లి పట్టణంలోని శైవ క్షేత్రాలన్నీ శివనామ స్మరణతో మారుమోగుతున్నాయి. కోటవీధిలో వెలసిన శ్రీ భోగ లింగేశ్వర స్వామి, వేల్పుల వీధిలో ఉన్న శ్రీ కాశీ విశ్వేశ్వర ఆలయం, కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న శ్రీ సిద్ధి లింగేశ్వర స్వామి ఆలయం, సాధువుల గుడి లలో తెల్లవారుజాము నుండి భక్తులు శివలింగానికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఆలయాల అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్ని ఆలయాలలో ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. మారు మ్ర రాత్రి స్వామివారి రుద్రాభిషేకాలు అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.ఆలయాలన్నీ పుష్పాలంకరణలో భక్తులకు కన్నుల పండుగ దర్శనమిస్తున్నాయి. అలాగే ఆలయాలను విద్యుత్ దీపాలంకరణలతో ఆలయ కమిటీలో అందంగా తీర్చిదిద్దారు. రాత్రి అంతా భక్తులు జాగారం చేస్తూ ఆలయాలను సందర్శించు సందర్భంగా ఆలయాలు వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ శ్రావణి ఆధ్వర్యంలో టౌన్ సీఐ టీవీ విజయ్ కుమార్ వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## శతశాతం ఇ-పంట నమోదు చేయాలి



### జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్

**అనకాపల్లి, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** రైతు పంటను నూరు శాతం ఇ-పంట నందు నమోదు చేయాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరు కార్యాలయ సమావేశం మందిరంలో వ్యవసాయశాఖకు సంబంధించి ఇ-పంట నమోదు పై మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 32వేల ఎకరాలకు సంబంధించి 84 శాతం ఇ-పంట నమోదు పూర్తయిందని, 28వ తేదీలోగా నూరుశాతం ఇ-పంట నమోదుతో పాటు, ఇ-కెవైసీ కూడా పూర్తిచేయాలని జిల్లా కలెక్టరు ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని తెలిపారు. ఫార్మర్ రిజిస్టరీ పక్రియ నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని, లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలని జిల్లా కలెక్టరు అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయఅధికారి బి.మోహనరావు, డివిజను, మండల వ్యవసాయ అధికారులు హాజరయ్యారు.

# ఎన్నికల కోడ్ సందర్భంగా శివరాత్రి భక్తులకు అన్న ప్రసాదాలు అందించలేకపోతున్నా

## శాసనసభ్యులు కేఎస్ఎన్ రాజు

**రావికమతం, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):-** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ఈ ఏడాది కళ్యాణపులోవ మహాశివరాత్రి మహోత్సవ ఉత్సవాలకు వచ్చిన భక్తులకు అన్నప్రసాదాలు అందించలేకపోతున్నామని చోడవరం ఎమ్మెల్యే కే. ఎస్ ఎన్ రాజు తెలిపారు. రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ కళ్యాణపులోవ లో ఈనెల 26 నుంచి 28 వరకు నిర్వహించనున్న కళ్యాణలోవ పోతురాజు బాబు, పెద్దింటి అమ్మవార్ల ఆలయాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఉత్సవాలకు ఉత్తరాంధ్ర నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ప్రతి ఏటా అన్నప్రసాదాలు పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తున్న విషయం అందరికీ తెలిసిందే అన్నారు. అయితే ఈ ఏడాది ఎన్నికల కోడ్ కారణంగా ప్రత్యక్షంగా ప్రజా ప్రతినిధులు ఎటువంటి ప్రసాదం, అన్న ప్రసాదం పంపిణీ చేయకూడదన్న నిబంధన మేరకు ఎటువంటి కార్యక్రమాలు తమ నిర్వహించలేకపోతున్నందుకు భక్తులందరూ గమనించాల్సిందిగా తెలియపరుస్తున్నానన్నారు. స్వచ్ఛందంగా ఎవరికివారు భోజనం ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. ఈ అసౌకర్యానికి భక్తులు మన్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల



టిడిపి పార్టీ అధ్యక్షుడు రాజానా కొండనాయుడు, బంటు శ్రీనివాసరావు, సర్పంచ్ జోగిపాత్రుడు, కోట సత్యనారాయణ, మరుపాక మోడల్ స్కూల్ చైర్మన్ కాసేటి రాజు తదితరులు పాల్గొన్నారు.

## కూరగాయల మార్కెట్లో భారీ అన్న సమారాధన



అనకాపల్లి, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):- మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని స్థానిక గాంధీ కూరగాయల మార్కెట్లో ఉన్న శ్రీ మల్లికార్జున స్వామి వారి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన కార్యక్రమం బుధవారం జరిగింది. గాంధీ కూరగాయల మార్కెట్ హెూల్సేల్ రిటైల్ వర్తకులు వ్యాపారస్తులు సహకారంతో భారీ అన్నసంతర్పణ కార్యక్రమం జరిగింది. సుమారు 3,500 మంది భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూరగాయల వర్తకులు సూరిశెట్టి జగమహేశ్వర. రావు మల్ల జగ్గప్పారావు, కొనతాల శివ, కాండ్రేగులబుజ్జి మల్ల జగ్గాప్పరావు సూరిశెట్టి నాయుడు విల్లూరి నాయుడు , శరగడం ప్రసాద్ ,బొడ్డేటి జగదీష్ నూకాంబిక చిల్లరవర్తకులు ఆధ్వర్యంలో జరిగింది మార్కెట్లో కళాసీలు గుమస్తాలు అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఎన్నికలు పూర్తయ్యేంతవరకు బహిరంగ సభలు నిషేధం

అనకాపల్లి, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్ బ్యూరో):- ఉపాధ్యాయ నియోజకవర్గం శ్రీకాకుళం-విజయనగరం-విశాఖపట్నం శాసనమండలి ఎన్నికలు తేది.27.02.2025న శుక్రవారం ఉదయం 7.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు జరుగనున్న సందర్భంగా అనకాపల్లి జిల్లా అధికార పరిధిలో 25.02.2025 నుండి 28.02.2025 వరకు ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు భారతీయ న్యాయ సంహిత 2023లోని సెక్షన్ 163 ప్రకారం పోలింగు ముగిసే సమయానికి 48 గంటల వ్యవధిలో సమావేశాలు మరియు బహిరంగ సభలను నిర్వహించడంపై నిషేధం ఉంటుందని జిల్లా కలెక్టరు మరియు జిల్లా ఎన్నికల అధికారి విజయ కృష్ణన్ తెలియజేసారు. భారతీయ న్యాయ సంహిత, 2023లోని సెక్షన్ 189(1) ప్రకారం చట్టవిరుద్ధమైన సమావేశాలు, ర్యాలీలపై నిషేధం ఉంటుందని తెలిపారు. లౌడ్ స్పీకర్ను ఉపయోగించడానికి అనుమతించబడదని, జిల్లా లో ఏదైనా పోలింగ్ స్టేషన్కు (పోలింగ్ స్టేషన్లో క్యూలో ఉన్న ఓటర్లు మినహా) 200 మీటర్ల పరిధిలో 5 మంది కంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమిగూడడంపై నిషేధం విధించబడినదని జిల్లా కలెక్టరు తెలిపారు.పై ఆదేశాలను ధిక్కరిస్తే భారతీయ న్యాయ సంహిత, 2023లోని సెక్షన్ 223 కింద మరియు అమలులో ఉన్న ఇతర సంబంధిత చట్టాల ప్రకారం శిక్షార్హమైన చర్య తీసుకోబడుతుందని హెచ్చరించారు.

# రాబోయే రోగాలను ముందే గుర్తిస్తున్నాం

**ఏఐ, మెషీన్ లెర్నింగ్ ద్వారా సింగపూర్ ప్రజల జన్యు సమాచారాన్ని విశ్లేషిస్తున్నాం**
**జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్సీ అవార్డు గ్రహీత ప్యాట్రిక్ టాన్ వెల్లడి**



హైదరాబాద్, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):- సింగపూర్లో ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు జరుగుతున్న ప్రయత్నం గురించి ప్రతిష్టాత్మక బయో ఆసియా జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డుగ్రహీత డాక్టర్ ప్యాట్రిక్ టాన్ సభికులతో పంచుకున్నారు. 'సింగపూర్లో వృద్ధుల సంఖ్య పెరుగుతుండటంతో ఆసుపత్రులపై ఒత్తిడి ఎక్కువవుతోంది. చికిత్సలకు అయ్యే ఖర్చు కూడా బాగా పెరిగిపోతోంది. ఈ నేపథ్యంలో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూనే ఆరోగ్య రంగంలో ఖర్చులు తగ్గించుకోవడం ఎలా? అనే దానిపై ప్రభుత్వం ఆలోచించింది. అందులో భాగంగానే ఇప్పుడు మేము భవిష్యత్తులో ఎవరు జబ్బు పడవచ్చో.. ఆ జబ్బులు ఎలాంటివో గుర్తించేందుకు.. అందుకు తగ్గట్లుగా చర్యలు తీసుకొనేందుకు ఓ బృహత్తర కార్యక్రమం చేపట్టాం.

ప్రిసైస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ 'నేషనల్ ప్రిసిషన్ మెడిసిన్ ప్రోగ్రామ్'కు నేను నేతృత్వం వహిస్తున్నా. ఇందులో భాగంగా ప్రజల జన్యు సమాచారంతోపాటు వారి ఆహార అలవాట్లు, వైద్య వివరాలు సేకరించాం. మెషీన్ లెర్నింగ్, కృత్రిమ మేధ సాయంతో భవిష్యత్తులో ఎవరు జబ్బు పడతారో.. ఎలాంటి జబ్బులు వచ్చే అవకాశం ఉందో, వాటికి చవకైన వైద్యం ఎలా అందుతుందో గుర్తించాం. ఈ రెండు అంశాలకు తగ్గట్లు ప్రభుత్వం బీమా, న్యాయపరమైన రక్షణ వంటి విధానాలను రూపొందించింది. సుమారు లక్ష మంది సింగపూరియన్ల వివరాలు సేకరించాలన్నది లక్ష్యం కాగా ఇప్పటివరకూ 97 వేల మంది ఈ కార్యక్రమంలో చేరారు. దేశ ప్రజలందరినీ గుర్తించేందుకు ఉన్న పద్ధతి (ఆధార్ వంటిది) ద్వారా వారిలో ఎవరు ఎక్కడ జబ్బు పడ్డా ఆ వివరాలు ఎలక్ట్రానిక్ రిజిస్టర్లో నమోదవుతాయి. ఏ జబ్బు వచ్చింది? ఏం మందులిచ్చారు? ఇతర వివరాలు ఏమిటన్నది తెలిసిపోతుంది. వాటిని విశ్లేషించడం ద్వారా భవిష్యత్తులో రాగల జబ్బులను గుర్తిస్తున్నాం. రోగులకు ఎలాంటి చికిత్స అందించాలనే అంశంపైనా పనిచేస్తున్నాం. చివరి దశలో భాగంగా మొత్తం సింగపూర్ జనాభాలో 10 శాతం మంది నుంచి వివరాలు సేకరిస్తాం. అయితే వారు ఇప్పటికే ఏదో ఒక జబ్బు బారినపడి చికిత్స తీసుకుంటున్న వారై ఉంటారు. వీరి నుంచి సేకరించే సమాచారం వ్యాధి ఎలా ముదురుతోంది? దుష్ప్రభావాలు ఏమిటి వంటివి తెలుస్తాయి.మొత్తమ్మీద ఇంకో ఐదేళ్లలో ఈ ప్రాజెక్టు ద్వారా గణనీయమైన పురోగతి సాధించగలమని ఆశిస్తున్నాం' అని ప్యాట్రిక్ టాన్ వివరించారు.

# తమిళనాట పొలిటికల్ హీట్

## టీవీకే ఆవిర్భావ వేడుకకు పీకే హాజరు



చెన్నై, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):- తమిళనాడులో రాజకీయం ఆసక్తికరంగా మారింది. సినీ నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం(టీవీకే) పార్టీ మొదటి ఆవిర్భావ దినోత్సవం నేపథ్యంలో బుధవారం చెన్నైలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. పార్టీ చీఫ్ విజయ్తో పాటు ఈ కార్యక్రమానికి రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ హాజరు కావడం చర్చనీయాంశమైంది. దీంతో, తమిళ పాలిటిక్స్ రసవత్తరంగా మారింది.

కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే తమిళగ వెట్రి కళగం(టీవీకే) పార్టీని స్థాపించి ముందుకు సాగుతున్నారు. పార్టీ మొదటి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చెన్నైలోని మామల్లపురంలో భారీ సభ నిర్వహించారు . ఈ సభకు దాదాపు మూడు వేల మంది ముఖ్య నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ క్రమంలో పాస్లను సైతం అందించారు.

ఇక తమిళనాడులో వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ సభకు ప్రాధాన్యత ఏర్పడింది.

# పౌరులందరి కోసం సార్వత్రిక పెన్షన్ స్కీమ్ - కేంద్రం కసరత్తు

దిల్లీ: దేశంలోని పౌరుల కోసం కేంద్రం కొత్త పింఛను పథకం ఒకటి తీసుకురానుంది. 60ఏళ్లు పైబడిన వారందరికీ పెన్షన్ అందించే ఉద్దేశంతో సార్వత్రిక పెన్షన్ స్కీమ్పై కేంద్రం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎలాంటి సామాజిక భద్రత పథకానికీ నోచుకోని నిర్మాణరంగ కార్మికులు, గిగ్ వర్కర్లు వంటి వారికి ప్రయోజనం కల్పించే ఉద్దేశంతో ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు కార్మిక శాఖ వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొంటున్నాయి.

పదవీ విరమణ అనంతరం పింఛను అందించేందుకు ఉద్యోగులకు ఉద్యోగ భవిష్యనిధి సంస్థ ఉంది. ఏదైనా కంపెనీలో వ్యక్తి పనిచేస్తున్నప్పుడు.. అతడి వేతనం నుంచి 12 శాతం చొప్పున అతడి ఈపీఎఫ్ ఖాతాకు జమ అవుతుంది. పనిచేస్తున్న సంస్థ సైతం అంతే మొత్తంలో జమ చేస్తుంది. ఇక్కడ ప్రభుత్వం ఎలాంటి జమ చేయడం లేదు. దీంతో పాటు సంఘటిత రంగంలో పనిచేసే వారి కోసం అటల్ పెన్షన్ యోజన, వీధి వ్యాపారుల కోసం ప్రధాన మంత్రి శ్రమ యోగి మాన్దాన్ యోజన, రైతుల కోసం ప్రధానమంత్రి కిసాన్ మాన్దాన్ యోజన వంటి పథకాలు ఉన్నాయి. వీటికి కొంత మొత్తం పౌరులు చెల్లిస్తుండగా.. ఇంకొంత మొత్తం ప్రభుత్వం చెల్లిస్తోంది.

ఈ నేపథ్యంలో పౌరులందరికీ ఒకటే తరహా పెన్షన్ పథకం తేవాలని కేంద్రం భావిస్తోంది. ప్రస్తుతం ఉన్న పొదుపు, పింఛను పథకాలను హేతుబద్ధీకరించి ఈ కొత్త పథకానికి శ్రీకారం చుట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఉద్యోగం చేస్తున్న వారితో పాటు ఉద్యోగంలో లేనివారు సైతం ఈ స్కీమ్లో చేరొచ్చు. అంటే స్వయం ఉపాధి అవకాశాలు పొందుతున్నవారూ దీంట్లో చేరొచ్చన్నమాట. ఈ పథకానికి సంబంధించిన విధివిధానాలపై కసరత్తు ప్రారంభమైందని, త్వరలోనే దీనిపై ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని అధికారి ఒకరు వెల్లడించారు. నేషనల్ పెన్షన్ స్కీమ్ యథాతథంగా కొనసాగుతుందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.






## 'హరి హర వీరమల్లు'.. డైలాగ్స్ కోసం పవన్ వర్క్



అగ్ర కథానాయకుడు పవన్ కళ్యాణ్తో కలిసి 'హరి హర వీరమల్లు' అంటూ సందడి చేసేందుకు సిద్ధమయ్యారు నిధి అగర్వాల్. తాజాగా ఈ సినిమాలోని 'కొల్లగొట్టినాదిరో..' పాటను విడుదల చేసిన విషయం తెలిసిందే. అందులో పవన్, నిధిల కెమిస్ట్రీ అందరినీ ఆకట్టుకుంది. దీనిపై నిధి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. పవన్కల్యాణ్ ఈ సినిమాలోని ప్రతీ అంశాన్ని దగ్గరుండి పరిశీలించారని చెప్పారు.

"మేము హరి హర వీరమల్లు కోసం రెండు సంవత్సరాలుగా వర్క్ చేస్తున్నాం. 'కొల్లగొట్టినాదిరో..' లిరికల్ సాంగ్లో నటీనటులతో, సాంకేతిక నిపుణులతో పవన్ మాట్లాడుతున్న చిత్రాలు మీరు చూశారు. ఈ సినిమా కోసం ఆయన స్క్రిప్ట్ వర్క్ నుంచి ప్రతీ అంశాన్ని పరిశీలించారు. ఆయన పాత్ర కోసమే కాకుండా డైలాగ్స్ కోసం కూడా వర్క్ చేశారు. ఇందులోని పాత్రల కోసం నేను, పవన్ ఇద్దరం రిహార్సల్స్ చేశాం. సన్నివేశాల గురించి చర్చించుకున్నాం. అలా రిహార్సల్స్ చేస్తే చిత్రీకరణ సులభం అవుతుంది. షూట్ సజావుగా జరిగితే సమయం వృథా కాదు. వర్క్షాప్ ఒక మంచి అనుభవాన్ని ఇచ్చింది" అని నిధి అన్నారు.

క్రిష్ జాగర్లమూడి, జ్యోతికృష్ణ దర్శకులుగా పవన్కల్యాణ్ హీరోగా పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతోన్న చిత్రమే 'హరి హర వీరమల్లు'. 17వ శతాబ్దపు మొఘల్ సామ్రాజ్యం నేపథ్యంలో పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా ముస్తాబవుతోంది. రెండు పార్టులుగా విడుదల కానుండగా.. తొలి భాగం 'హరిహర వీరమల్లు పార్ట్1: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో ప్రేక్షకుల ముందుకురానుంది

## 'చికినీ చమేలీ' పాడిన చిన్నారి.. నాకెంతో ఇబ్బందిగా అనిపించింది: శ్రేయా ఘోషల్



తన మధురమైన స్వరంతో ఎంతో మంది సినీప్రియుల హృదయాలు గెలుచుకున్నారు ప్రముఖ సింగర్ శ్రేయా ఘోషల్. 'ఆల్ హార్ట్స్ టూర్'లో భాగంగా త్వరలో ఆమె చెన్నైలో లైవ్ కాన్సర్ట్ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఐటెమ్ సాంగ్స్ ఆలపించడంపై స్పందించారు. కొన్ని సంఘటనల తర్వాత అలాంటి పాటల విషయంలో తాను ఎంతో ఆలోచించి నిర్ణయం తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

"చికినీ చమేలీ' వంటి ఐటెమ్ సాంగ్స్ను ఆలపించాను. శృంగారం, అసభ్యత మధ్య ఒక సున్నితమైన గీత ఉంటుంది. అది నాకు తెలుసు. ఆయా పాటల్లోని సారాంశం తెలియనప్పటికీ చాలా మంది చిన్నారులు వాటిని ఆలపించడం చూసిన తర్వాత.. ఇలాంటి పాటల ఎంపికలో ఎంతో ఆలోచించి నిర్ణయం తీసుకుంటున్నా. చిన్నారులు దీనిని ఒక సరదా పాటగా భావిస్తున్నారు. డ్యాన్స్లు చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో వారు నన్ను కలిసి.. "మీ పాటలు మాకెంతో ఇష్టం. మీ ఎదుట ఒక పాట పాడాలని ఉంది" అంటూ ఆ పాటలనే పాడుతున్నారు. అలా నేను చాలాసార్లు ఇబ్బంది పడ్డాను. ఐదేళ్ల వయసున్న ఒక చిన్నారి ఒకసారి నన్ను కలిసి 'చికినీ చమేలీ' పాట పాడింది. ఆ వయసులో చిన్నారి అలాంటి పాటలు పాడటం నాకు ఏమాత్రం మంచిగా అనిపించలేదు. ఇలాంటి పలు సంఘటనలు ఎదురైన తర్వాత పాటల ఎంపిక విషయంలో ఒకింత జాగ్రత్తగా ఉండాలని అర్థమైంది" అని శ్రేయా ఘోషల్ తెలిపారు. చెన్నై వేదికగా మార్చి 1వ తేదీన, కోయంబత్తూర్లో మార్చి 15న ఆమె కాన్సర్ట్ జరగనుంది.

సంగీతంపై ప్రేమ వల్లే తాను ఈ స్థాయికి రాగలిగానని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. "పాటలతో ఎప్పుడూ గొప్ప భావోద్వేగాలను ప్రేక్షకులకు అందించాలనుకుంటాను. సంగీతంపై నాకున్న ప్రేమే ఉన్నతస్థాయిలో నిలిచేలా చేసిందని నమ్ముతున్నా. నేను ఇంట్లో ఉన్నప్పుడు కూడా పియానో పట్టుకొని ఉంటా. నా ప్రతి పనిలో సంగీతంపై ఇష్టం కనపడుతూనే ఉంటుంది. అందుకేనేమో ప్రజలు నన్ను ఇంతలా అభిమానిస్తున్నారు" అని తెలిపారు.

## టెస్లా ఎంట్రీపై అమితాబ్ పోస్ట్.. ఆ వెంటనే..



సోషల్మీడియాలో యాక్టివ్గా ఉంటారు అగ్ర నటుడు అమితాబ్ బచ్చన్. ఆన్లైన్ వేదికగా పలు అంశాలపై తన అభిప్రాయాన్ని పంచుకుంటూ ఉంటారు. మంగళవారం రాత్రి ఇన్స్టా వేదికగా ఆయన ఒక వైరల్ వీడియో షేర్ చేశారు. ఇలాంటివి చూసే అమెరికాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా ఇండియాకు రాకూడదని నిర్ణయించుకుంటుందేమోనని ఆయన రాసుకొచ్చారు.

భారతదేశానికి చెందిన కొంతమంది యువకులు విభిన్నమైన ద్విచక్ర వాహనాన్ని సిద్ధం చేశారు. ఒకేసారి ఏడుగురు వ్యక్తులు ఈ బైక్పై ప్రయాణించవచ్చని.. సౌరశక్తితో ఇది నడుస్తుందని పేర్కొన్నారు. వ్యర్థ భాగాల నుంచి తయారుచేసిన ఈ ద్విచక్రవాహనం కోసం సుమారు రూ.10 వేలు ఖర్చు పెట్టినట్లు చెప్పారు. బైక్ డ్రైవ్ చేసి చూపించారు. దీనికి సంబంధించిన ఓ వీడియోను వారు ఆన్లైన్లో షేర్ చేయగా అది వైరల్గా మారింది. తాజాగా ఆ వీడియో అమితాబ్ దృష్టిలో పడింది. దానిని ఇన్స్టా వేదికగా షేర్ చేసిన ఆయన.. "ఈ వీడియో చూసిన తర్వాత టెస్లా కంపెనీ ఇండియాకు రాకూడదని నిర్ణయించుకుంటుందేమో" అని పోస్ట్ పెట్టారు. తన పోస్ట్ను తప్పుగా అర్థం చేసుకొనే ఉద్దేశం ఉందని గ్రహించిన ఆయన కొద్దిసేపటికి ఎడిట్ చేశారు. "నా స్నేహితుడు పంపించిన ఒక సరదా వీడియోను మీతో పంచుకుంటున్నా" అని కొత్త క్యాప్షన్ జత చేశారు.

## హీరోను ప్రశంసించారు.. మరి దర్శకుడి సంగతేంటి: సందీప్ వంగా



సందీప్రెడ్డి వంగా దర్శకత్వంలో రణ్బీర్ కపూర్ హీరోగా నటించిన సినిమా 'యానిమల్'. ఈ చిత్రం భారీ విజయాన్ని సొంతం చేసుకొని మంచి కలెక్షన్లు సాధించింది. అయితే, ఈ సినిమాపై కొందరు సినీ ప్రముఖులు విమర్శలు కురిపించిన సంగతి తెలిసిందే. తీవ్ర హింస, పలు సన్నివేశాల్లో స్త్రీని తక్కువగా చూపించడంపై కొందరు అసహనం వ్యక్తంచేశారు. తాజాగా దీనిపై ఓ ఇంటర్వ్యూలో సందీప్ వంగా స్పందించారు. హీరోను ఎవరూ విమర్శించలేదన్నారు. అలాగే దీని సీక్వెల్ గురించి అప్డేట్ పంచుకున్నారు.

"యానిమల్'ను విమర్శించినవారంతా రణ్బీర్ను తెలివైన వ్యక్తి అని అన్నారు. ఎవరూ హీరోను విమర్శించలేదు. నాకు ఈ విషయంలో అసూయ లేదు. కానీ.. విషయం ఏమిటంటే.. 'రణ్బీర్ తెలివైన వ్యక్తే.. మరి రచయిత, దర్శకుడి పరిస్థితేంటి? నాకు ఈ తేడా ఇప్పటికీ అర్థంకాలేదు. వారంతా రణ్బీర్తో కలిసి పనిచేయాలనుకుంటున్నారని నాకు స్పష్టంగా అర్థమైంది. నేను పరిశ్రమకు కొత్త కాబట్టి నన్ను విమర్శించడం చాలా సులభం. ఒక నిర్మాత సినిమా తీయడానికి 2, 3 సంవత్సరాలు పడుతుంది. ఆ సమయంలో హీరో ఏకంగా 5 సినిమాలైనా చేయగలడు. యానిమల్ను విమర్శించిన వారంతా రణ్బీర్తో సినిమా చేయాలనుకుంటున్నారు కాబట్టే అతడిని ఏమీ అనలేదు. ఇది నిజం" అని అన్నారు.

యానిమల్ భారీ విజయాన్ని అందుకోవడంతో యాక్షన్ ప్రియులంతా దీని సీక్వెల్ కోసం ఎదురుచూస్తున్నారు. 'యానిమల్ పార్క్' అనే టైటిల్తో ఈ సీక్వెల్ రానుంది. తాజాగా దీని గురించి సందీప్ మాట్లాడారు. "మూడు భాగాలుగా తీయాలనుకుంటున్నా. స్క్రిప్ట్ రాసుకున్నప్పుడే ఈ ఆలోచన ఉంది. యానిమల్ పార్క్లో రణ్బీర్ ద్విపాత్రాభినయం చేయనున్నారు. హీరో, విలన్ రెండుగా అలరించనున్నారు" అని చెప్పారు.

## శివాలయాన్ని దర్శించుకున్న గంటా



**విశాఖపట్నం, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):-** మహా శివరాత్రిని పురస్కరించుకుని రుషికొండ బీచ్ లోని శివాలయాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పూజారులు ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.ప్రశాంత్, కార్పొరేటర్ లొడగల అప్పారావు, చెట్టిపల్లి గోపీ, గరే గుర్నాథ్, అప్పలరాజు, రాంబాబు, దొరబాబు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## బీచ్ రోడ్‌లో కోటి శివలింగాలకు మహా కుంభాభిషేకం





**విశాఖపట్నం, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):-** మహాశివరాత్రి పర్వదినము సందర్భంగా విశాఖ ఆర్కే బీచ్ లో కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ టి. సుబ్బారామి రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కోటి శివలింగాలకు మహా కుంభాభిషేకం అంగరంగ వైభవంగా నిర్వహించారు.మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులే నేరుగా ఈ శివలింగాలకు అభిషేకం చేసుకున్నారు. సుబ్బ రామి రెడ్డి భక్తులు కు పసుపు తాళ్లు అందచేసారు..సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు దంపతులు కోటి శివలింగాలకు మహా అభిషేకం గావించారు. సుబ్బ రామి రెడ్డి వీరితో అభిషేకం చేయించారు.

ఆర్కే బీచ్‌లో ఏర్పాటుచేసిన కోటి శివలింగాలను ప్రముఖులతోపాటు, పెద్ద సంఖ్యలో నగర ప్రజలు ఇక్కడికి విచ్చేసి పూజలు నిర్వహించారు. వైసిపి విశాఖపట్నం మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి శివలింగాలను దర్శించి సుబ్బరామిరెడ్డితో కలిసి అభిషేకం చేశారు.

## త్రిమూర్తి శివ జయంతి మహోత్సవంలో నగర మేయర్



**విశాఖపట్నం, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):-** ఫిబ్రవరి 26 మహాశివరాత్రి పురస్కరించుకొని రైల్వే న్యూ కాలనీ ప్రాంతంలో త్రిమూర్తి శివ జయంతి మహోత్సవాలు శ్రీ బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో నిర్వహించే శివారాధన కార్యక్రమంలో బుధవారం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ ధర్మస్థాపనకై భగవంతుడు శివుడి రూపంలో ఈ భూమిపై అవతరించాడని, సకల జీవులకు ఆధారం శివుడేనని, ఈ మహా శివరాత్రి పర్వదినాన శివయ్యకు దీపారాధన జాగారం చేస్తే సకల పాపాలు తొలగిపోతాయని, ప్రతి ఏటా ప్రజాపిత బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో త్రిమూర్తి శివ జయంతోత్సవాలు ఘనంగా నిర్వహించడం సంతోషమని, సకలజనులు సుఖ సంతోషాలతో ఉండాలని నగరం అభివృద్ధి జరగాలని కోరుకున్నట్లు మేయర్ తెలియజేశారు.

## మద్యంబాబులకు సరికొత్త శిక్ష

**బనగానపల్లి, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):-** బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పోలీసులకు పట్టుబడిన వారికి నంద్యాల జిల్లా బనగానపల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సరికొత్త శిక్ష విధించింది. మద్యం అనర్థాలు, రహదారి నిబంధనలపై ప్లకార్డులను ప్రదర్శిస్తూ ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో నిల్చోవాలని తీర్పునిచ్చింది. పలు గ్రామాలకు చెందిన 47 మంది మద్యంప్రియులను గుర్తించి న్యాయస్థానం ఎదుట పోలీసులు హాజరుపరిచారు. వారిలో పరివర్తన కోసం న్యాయమూర్తి షేక్ అబ్దుల్ రెహ్మాన్ ఈ ఉత్తర్వులిచ్చారు.

## తాచేరు కాజువేపై చెరుకు లారీ బోల్తా

- ఎమ్మెల్యే, ఆర్ అండ్ బి అధికారులు తక్షణమే స్పందించి తాచేరు బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి...

- స్థానిక ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు విజ్ఞప్తి



**బుచ్చయ్యపేట, ఫిబ్రవరి 25 (విశాఖ సమాచారమ్):-** మండలంలోని విజయరామరాజుపేట గ్రామం వద్ద తాచేరు పై గల కాజువే పై చెరుకు ఓవర్ లోడు తో వెళుతున్న లారీ అదుపుతప్పి ప్రమాదవశాత్తు అకస్మాత్తుగా తిరగ బడిపోయింది. గత కొన్ని నెలలుగా తాచేరు బ్రిడ్జి వరదలు కు కూలిపోవడం తో కాజువే పై గతుకుల రోడ్డు, ఓవర్ లోడు కారణంగా ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

ముందుగా లారీ డ్రైవర్ దూకేయటంతో ప్రమాదం తప్పింది. ఈ సంఘటనలో ఎవరికీ ప్రాణ నష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు తక్షణమే స్పందించి తాచేరు బ్రిడ్జి నిర్మాణం చేపట్టి గోవాడ ఫ్యాక్టరీ చెరుకు క్రషింగ్ సీజన్ లో ఇటువంటి చెరుకు లారీలు, వాహన దారులు ప్రమాదాల బారిన పడకుండా చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకున్న కన్నప్ప టీమ్



**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):-** శ్రీకాళహస్తిలో శివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు. మంచు విష్ణు నటించిన కన్నప్ప మూవీ ఏప్రిల్ 25న విడుదల కాబోతోంది. మహా శివరాత్రి సందర్భంగా ఈ రోజు శ్రీకాళస్తీశ్వరుడిని సినిమా యూనిట్ దర్శించుకుంది. మంచు మోహన్ బాబుతో పాటు విష్ణు, డాన్స్ మాస్టర్ ప్రభు దేవా శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకున్నారు. కన్నప్ప సినిమా విజయం సాధించాలని కోరుతున్నారు.

ఈ సందర్భంగా మోహన్ బాబు మాట్లాడుతూ "శ్రీకాళహస్తి ఆలయం అలకరణ కళా నైపుణ్యంలా ఉంది. అతిశయోక్తికాదు. ఈ క్రెడిట్ అంతా ఎమ్మెల్యే బొజ్జలదే. నాకు అత్యంత ఆత్మీయుడైన తమ్ముడు ఆనంద్ కూడా ఉన్నారు. ఈశ్వరుడి గురించి తెలియని వాళ్లుండరు. ఆ భగవంతుడి ఆశీస్సులతో కన్నప్ప సినిమా తీస్తున్నాం. సినిమా రిలీజ్ తర్వాత అన్ని విషయాలు మాట్లాడతా. కన్నప్ప టీమ్ అంతా శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకుంది. కన్నప్పగా విష్ణుగా నటించారు. పరమేశ్వరుడి అశీర్వాదం ప్రజలకు, తమకు, తమ సినిమా ఉండాలి." అని కోరుకున్నారు.

## నీటి పంచాయతీ పై వాడివేడిగా చర్చలు

### ఏపీ, తెలంగాణ అధికారుల హాజరు



హైదరాబాద్: ఏపీ, తెలంగాణ మధ్య నీటి పంచాయితీని పరిష్కరించేందుకు కేఆర్‌ఎంబీ తాజాగా బుధవారం మరోసారి భేటీ అయింది. హైదరాబాద్‌లో జరిగిన ఈ సమావేశానికి రెండు రాష్ట్రాల ఇరిగేషన్ శాఖ అధికారులు హాజరయ్యారు. కేఆర్‌ఎంబీ చైర్మన్ అతుల్ జైన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో నీటి వాటాలపై చర్చించారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ సాగర్ నుంచి 63 టీఎంసీలు కావాలని తెలంగాణ కోరుతోంది. అటు ఏపీ కూడా 55 టీఎంసీలు అవసరముందని ఏపీ అంటోంది.

ఈ భేటీల కంటే ముందు తెలంగాణ, ఏపీ ఈఎన్సీల సమాశం జరిగింది. నల్గొండ, ఒంగోలుకు సంబంధించిన సీఈల సమావేశం జరిగింది. శ్రీశైలం, నాగార్జున సాగర్ జలశయాల్లో ఉన్న నీటి లభ్యత, మే నెలాఖరు వరకూ రెండు రాష్ట్రాల అవసరాలపై చర్చించారు. ఆ సమావేశంలో తెలంగాణకు 63 టీఎంసీలు, ఏపీకి 53 టీఎంసీలు కావాలని సీఈల మీటింగ్‌లో చర్చించారు. ఈ చర్చల సారాంశాన్ని ఈ రోజు జరుగుతున్న కేఆర్‌ఎంబీ సమావేశంలో నివేదించనున్నారు. ఈ నెల 21నే కేఆర్‌ఎంబీ సమావేశం జరిగింది. ఏపీ అధికారులు హాజరుకాలేమని చెప్పడంతో అదే రోజు కేఆరెంబీ ఎదుట తెలంగాణ అధికారులు హాజరై అభ్యంతరాలు, అవసరాలను వినిపించారు. డిమాండ్ల రూపంలో పత్రాన్ని అందజేశారు. ఏపీ ఎక్కువ నీటిని తరలిస్తోందని, వెంటనే నివారించాలని, టెలీ మెట్రీ మీటర్లను ఏర్పాటు చేయాలని, అవసరమైతే ఆ ఖర్చులను కూడా తామే భరిస్తామని తెలిపారు.

అయితే 24న జరిగిన సమావేశంలో ఏపీ,తెలంగాణ అధికారులు హాజరయ్యారు. నీటి వాటాలపై చర్చించారు. రెండు రాష్ట్రాల అభ్యంతరాలు, అవసరాలను వినిపించారు. అయితే చర్చలు అసంపూర్తిగా ముగిశాయి. అసలు శ్రీశైలం, నాగార్జున సాగర్ లో ఎంత నీటి లభ్యత ఉందనేదానిపై రెండు రాష్ట్రాల సీఈలతో కేఆర్‌ఎంబీ ఓ కమిటీని వేసింది. ఇప్పుడు అదే కమిటీతో ప్రస్తుతం కేఆర్‌ఎంబీ మీటింగ్ ఏర్పాటు చేసింది. ఈ సమావేశంలో ఈ కమిటీ నివేదికను సమర్పించారు. అయితే తెలంగాణ మరో వాదనను వినిపిస్తోంది. ఏడాది రెండు జలశయాల్లో 1000 టీఎంసీల నీరు ఉంటే అందులో తాత్కాలిక సర్దుబాటు ప్రకారం ఏపీకి 666 టీఎంసీలు కాగా ఇందులో 630 టీఎంసీలు ఏపీ వినియోగించుకుందని, 27 టీఎంసీల నీరు మాత్రమే ఏపీకి అందించాల్సి ఉందని తెలంగాణ వాదిస్తోంది. అదే విధంగా తెలంగాణకు 112 టీఎంసీల నీరు తాగు, సాగుకు అవసరం ఉందని వాదనలు వినిపిస్తోంది. ఈ అంశాలపైనా కేఆర్‌ఎంబీ మీటింగ్‌లో చర్చించినట్లు తెలిసింది.

## హర హర మహాదేవ అంటూ శివాలయాల్లో మోగిన శివ నామస్మరణం

**జి మాడుగుల, ఫిబ్రవరి, 26, (విశాఖ సమాచారమ్):-** మహాశివరాత్రి సందర్భంగా జి మాడుగుల మండలంలోని ఉ న్న శివాలయాల్లో బుధవారం తెల్లవారుజాము నుంచే శివనామస్మరణంతో మారుమోగాయి. మండలంలోని జి మాడుగుల సంత బయలు. వంజరి.. బండవీది గెమ్మెలి. తో పాటు పలు చోట్ల ఉన్న శివాలయాల్లో తెల్లవారుజాము నుంచే భక్తులు సన్నిధి స్థానాలు చేసి తమ ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలాభిషేకాలు పంచామృతం పూ లాభిషేకాలు నిర్వహించారు.



## పీకల్లోతు కష్టాల్లో పాక్ క్రికెట్ టీమ్

### ఇండియా మోడల్‌ను అనుసరిస్తేనే బెటర్




ఇప్పుడందరి నోళ్లల్లో ఒకటే చర్చ.. పాకిస్థాన్ ఎందుకు ఇలా తయారైంది. డిఫెండింగ్ ఛాంపియన్‌లా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ బరిలోకి దిగిన ఆ జట్టు ఆడిన రెండింట్లోనూ ఓటమి పాలైంది. ఆతిథ్యహోదాలో కనీసం సెమీస్ వరకైనా వస్తే ఆ జట్టు అభిమానులు సంతోషపడేవారేమో. పాక్ పతనానికి మూడేళ్ల కిందటే ప్రమాద ఘంటికలు మోగినా.. ఆ జట్టు మేనేజ్‌మెంట్ పట్టించుకోలేదనే విమర్శలూ వినిపిస్తున్నాయి. ఈ కష్టాల నుంచి గట్టెక్కాలంటే భారత్‌లో అనుసరిస్తోన్న విధానాలను అవలంబించాలనేది క్రికెట్ విశ్లేషకుల సూచన.

పేపర్ పులి అంటారు కదా.. అలానే ఉంది పాకిస్థాన్ పరిస్థితి. రిజ్వాన్ - బాబర్ అజామ్ జోడీ.. యువ క్రికెటర్లు సల్మాన్ అఘా, ఖుష్దిల్ షాతోపాటు పేస్ త్రయం షహీన్ షా అఫ్రిది, నసీమ్ షా, హారిస్ రవూఫ్ ఆ జట్టులో కీలక క్రికెటర్లు. కానీ, మైదానంలోకి దిగాక పాక్ తేలిపోయింది. బాబర్ అజామ్ తొలి మ్యాచ్‌లోనే హాఫ్ సెంచరీ సాధించినా ఆ ఇన్నింగ్స్‌లో మెరుపు లేదు. నెమ్మదిగా ఆడి విమర్శలు ఎదుర్కొన్నాడు. ఇక భారత్‌పై ఆ బాధ్యతను రిజ్వాన్ తీసుకున్నట్లున్నాడు. 77 బంతులు ఎదుర్కొన్న రిజ్వాన్ కేవలం 46 పరుగులే చేశాడు. మరోవైపు కుర్రాడు సౌద్ షకీల్ మాత్రం దూకుడు పెంచేందుకు ప్రయత్నించాడు. ఆ తెగువ కూడా రిజ్వాన్ చూపించలేకపోయాడు. సరైన ఓపెనర్ లేకుండానే బరిలోకి దిగడమూ పాక్‌కు కష్టాలు తెచ్చిపెట్టింది. అలాగే స్క్వాడ్ ఎంపిక నుంచే పాక్ మేనేజ్‌మెంట్ తీసుకున్న నిర్ణయాలు విమర్శలకు దారితీశాయి. అందులో సెలక్షన్ కమిటీ నుంచి ప్రధాన కోచ్ వరకూ మార్పులు చేసుకుంటూ పోవడం లాంటి పొరపాట్లను ఎన్నో చేసింది.

**మూడేళ్లలోనే.. అంతా?**

26 మంది సెలక్టర్లు.. నలుగురు కెప్టెన్లు.. 8 మంది కోచ్‌లు.. ఇదీ పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు సేవలందించిన సిబ్బంది. ఇదేదో పాక్ క్రికెట్ మొదలైనప్పటి నుంచి అనుకొనేరు. ఇది కేవలం మూడేళ్ల కాలంలోనే పాక్ క్రికెట్‌లో చోటుచేసుకున్న పరిణామాలు. టెస్టు ఫార్మాట్‌లో దాదాపు 1000 రోజుల వరకు స్వదేశంలో ఒక్క మ్యాచ్ కూడా గెలవలేకపోయింది. గత పొట్టి కప్ తర్వాత కోచ్‌గా వ్యవహరించిన గ్యారీ కిరిస్టెన్ పాక్ మేనేజ్‌మెంట్, జట్టు సారథ్యంపై తీవ్ర ఆరోపణలు చేస్తూ బయటకు వెళ్లడం గమనార్హం. సెలక్షన్ కమిటీలో పక్షపాత ధోరణితో నిర్ణయాలు తీసుకోవడం.. జట్టులోకి అనుకూలంగా ఉండేవారినే ఎంపిక చేయడం కూడా పాక్ జట్టు పతనానికి కారణం. గత వన్డే ప్రపంచకప్ (2023) తర్వాత పాక్‌కు ముగ్గురు ప్రధాన కోచ్‌లుగా వచ్చారు. 2021 నుంచి 2024 వరకు వివిధ ఫార్మాట్లకు సక్లెయిన్ ముస్తాక్, అబ్దుల్ రహ్మాన్, గ్రాంట్ బ్రాడ్‌బర్న్, మహమ్మద్ హఫీజ్, అజర్ మహమ్మద్, జాసన్ గిలెస్పీ, గ్యారీ కిరెస్టన్ వంటి వారు కోచింగ్ బాధ్యతలు నిర్వహించారు. మరోవైపు దేశవాళీ క్రికెట్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేసి.. అక్కడినుంచి వచ్చినవారికి ఎలాంటి అవకాశాలు లేవనే భావన కలిగించడం గమనార్హం.

**ఫిట్‌నెస్ ఎక్కడ?**

క్రికెట్‌లో ఫిట్‌నెస్ పాత్ర చాలా కీలకం. ఆ విషయంలో మిగతా జట్లతో పోలిస్తే పాక్ ఆమడదూరంలో ఉంటుందనేది కాదనలేని సత్యం. ఫిట్‌నెస్, స్పెషలైజేషన్, డేటా ఆధారిత వ్యూహరచన వంటి వాటిల్లో ఆస్ట్రేలియా, భారత్‌కు కనుచూపు మేరలో కూడా దాయాది లేదు. ఆధునిక క్రికెట్‌లో స్పోర్ట్స్ సైన్స్, అనలిటిక్స్ వంటివి మైదానంలో, బయట తీసుకునే నిర్ణయాల్లో కీలకపాత్ర పోషిస్తాయి. తమ క్రికెటర్లు సిక్స్‌లు కొట్టడం లేదంటూ గత పీసీబీ ఛైర్మన్ భావించి మరీ ఏకంగా మిలిటరీ క్యాంప్‌లో శిక్షణ ఇప్పించాడు. తీరా గత టీ20 ప్రపంచకప్‌లో ఆ జట్టు పరిస్థితి ఏంటో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు.

**బయటపడాలంటే ఏం చేయాలి?**

పాకిస్థాన్ జట్టు బరిలోకి దిగితే ప్రత్యర్థి టీమ్‌లకు కఠిన సవాల్ తప్పదని అభిమానులు భావించేవారు. కానీ, స్వదేశంలో జరిగిన న్యూజిలాండ్ మ్యాచ్‌లో కనీసం విజయం సాధించాలనే కసి పాక్ జట్టు ఆటగాళ్లలో కనిపించకపోవడం క్రికెట్ అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఇక దుబాయ్ వేదికగా భారత్‌తో పోరులోనూ అదే తీరు. ఇకనైనా జట్టు ఎంపికలో కీలక విషయాలను పరిగణనలోకి తీసుకోవాలనేది క్రీడా పండితుల సూచన. అందుకోసం టీమ్‌ఇండియా మోడల్‌ను అనుసరించాలనేది వారి అభిప్రాయం. కేవలం దేశవాళీ, అంతర్జాతీయ క్రికెట్‌లో సగటును అంచనా వేసి ప్లేయర్లను ఎంపిక చేయకుండా.. మోడర్న్ సెలక్షన్ పారామీటర్లను పరిగణనలోకి తీసుకోవాలి. అందుకోసం భారత్ వంటి టాప్ టీమ్ నుంచి నేర్చుకోవాల్సిన అంశాలు చాలా ఉన్నాయి. సీనియర్ల స్థానాలను భర్తీ చేసే క్రమంలో కొత్త వారికి అవకాశాలూ ఇస్తూ పోవడం ఒకెత్తు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, రవీంద్ర జడేజా టీ20లకు వీడ్కోలు పలికారు. వారి స్థానాలను అభిషేక్ శర్మ, సంజుశాంసన్, వాషింగ్టన్ సుందర్‌తో భర్తీ చేసింది. ఇక వన్డేలకు రోహిత్‌కు డిప్యూటీ సారథిగా శుభ్‌మన్ గిల్‌ను ఛాంపియన్స్ ట్రోఫీకి పంపింది. అదేవిధంగా ఫామ్‌లో లేని క్రికెటర్లను దేశవాళీలో ఆడించడమూ చేసింది. భారత్‌లో సుస్థిరమైన వ్యవస్థ ఉండటంతో ఎన్ని ఒడిదొడుకులు వచ్చినా తట్టుకోగలిగిందనడంలో అతిశయోక్తి లేదు. కెప్టెన్, ప్రధాన కోచ్, చీఫ్ సెలక్టర్ విషయంలో నమ్మకం ఉంచాలి. అప్పుడే జట్టు ఆడే విధానంలోనూ మార్పు వస్తుందనేది క్రీడా పండితుల విశ్లేషణ. పాకిస్థాన్ ఈ విషయాలను ఎంత త్వరగా అమలుచేయగలిగితే పరిష్కారం కూడా అంతే ఫాస్ట్‌గా దొరుకుతుంది.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123
Hyderabad (Sai Ganesh) : Cell : 9030841841, Parawada (satyanarayana): Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Office (Raghunath) : 7013785256, Arilova (D.Venkatesh) : 94937 77970.
Maddilapalem (G.Raamakrishna) : 99084 24231, Anakapalli (M.Krishna Rao) : 63023 75539, Chintapalli (Srinivas) : 94923 40861.
Bheemunipatnam (B.Appalareddy) : 98662 78981, Srikakulam (Ramarao) : 70321 98574, Pithaapuram (staalin) : 94912 23264,

గమనిక : ఇక్కడ ఇవ్వబడిన పేర్లు కలిగిన వారిని మాత్రమే విశాఖ సమాచారమ్ దినపత్రికకు విలేఖరులుగా గుర్తించవలెను. ఇక్కడ పేరు లేకుండా ఎవరైనా విశాఖ సమాచారమ్ ప్రతినిధిగా చెబితే నమ్మవద్దు.